



ఏసుక్రీస్తు శిలువ మోసే ఘట్టం ప్రదర్శన

విమానాశ్రయంపై నిర్లక్ష్యం!

- విమానాలు రద్దయినా స్పందించని కేంద్ర మంత్రి
- భోగాపురం, విజయవాడ విమానాశ్రయాలతో పాటు విశాఖ ఎయిర్‌పోర్టుపైనా దృష్టి పెట్టాలని నగరవాసుల విన్నపం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం విమానాశ్రయం నుంచి విమానాలు ఒక్కొక్కటిగా రద్దయిపోతున్నాయి. ప్రధానంగా రాష్ట్ర రాజధాని విజయవాడకు విమానంలో వెళ్లే అవకాశం లేకుండా పోయింది. బ్యాంకాక్, మలేషియాలకు బుకింగ్స్ నిలిచిపోయాయి.

పర్యాటకంగా విశాఖను అభివృద్ధి చేస్తామని చెబుతున్న ప్రభుత్వం విదేశీ విమానాలు ఆగిపోతే ఇక పర్యాటకులు ఎలా వస్తారనేది ఆలోచించడం లేదు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు పక్క జిల్లాలోనే ఉంటారు. ఆయన ప్రతి నెలా భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయం పనులు ఎలా జరుగుతున్నాయో స్వయంగా వెళ్లి సమీక్షిస్తున్నారు. గురువారం విజయవాడ విమానాశ్రయం విస్తరణ పనులపై దేశ రాజధాని ఢిల్లీలో సమీక్ష నిర్వహించారు. మరి విశాఖ విమానాశ్రయం సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ఈ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మంత్రి ... మిగతా 6వ పేజీలో

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



జీసస్ త్యాగనిరతిని గుర్తు చేసుకుంటూ క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జ్ఞానాపురంలోని పునీత్ పేతురు దేవాలయం నుంచి రక్షణగిరి వరకూ విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుముల బాల ఆధ్వర్యంలో వందలాది మంది శిలువ మార్గం నిర్వహించారు. జీసస్‌తో శిలువ మోయించడం, రోమన్ సైనికులు కొరడాలతో కొట్టడం, శిలువ వేయడం వంటి ఘట్టాలను ప్రదర్శించారు. ఈ సన్నివేశాలను తిలకించిన పలువురు కంటతడి పెట్టుకున్నారు. - జ్ఞానాపురం

మహా ఉత్కంఠ

నేడే మేయర్‌పై కూటమి అవిశ్వాస తీర్మానం

మలేషియా నుంచి నగరానికి చేరుకున్న కూటమి కార్పొరేటర్లు

కేరళ, శ్రీలంకలోనే ఉండిపోయిన వైసీపీ కార్పొరేటర్లు

- అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు 74 మంది సభ్యుల మద్దతు అవసరం
- ప్రస్తుతం కూటమికి 75 మంది మద్దతు
- వైసీపీ చేతిలో 30 మంది
- వైసీపీ నుంచి మరో ఇద్దరిని లాగేందుకు కూటమి యత్నం
- కూటమిలో ఉన్న కార్పొరేటర్లకు వైసీపీ గాలం
- భారీ నజరానా ఇస్తామని ఆశ చూపుతున్నట్టు ప్రచారం
- చివరి క్షణంలో ఏదైనా జరిగే అవకాశం
- ఫలితంపై ఇరువర్గాల్లోనూ టెన్షన్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై కూటమి కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం నోటీస్ ఇవ్వడంతో శనివారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరగనున్నది. జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

అవిశ్వాస తీర్మానం ఎలాగైనా నెగ్గాలని కూటమి నేతలు కృతనిశ్చయంతో ఉంటే... కోరం లేకుండా చేయడం ద్వారా తీర్మానం వీగిపోయేలా చేసేందుకు వైసీపీ నేతలు యత్నిస్తున్నారు. ఇరువర్గాలు ఎదుటి వర్గంలోని సభ్యులను తమ వైపు తిప్పుకునేందుకు భారీ నజరానాలు అందజేస్తుండడంతో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ కొనసాగుతోంది.

జీవీఎంసీకి నాలుగేళ్ల కిందట ఎన్నికలు జరిగాయి. మొత్తం 98 వార్డులకు గాను వైసీపీ 58 వార్డులు గెలుచుకోవడంతో మేయర్ పీఠంపై 11వ వార్డు కార్పొరేటర్ గొలగాని హరివెంకటకుమారిని కూర్చోబెట్టారు. ఇండిపెండెంట్‌లుగా గెలిచిన నలుగురు కార్పొరేటర్లతోపాటు ... మిగతా 6వ పేజీలో



మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

జీవీఎంసీలో ప్రస్తుత బలాబలాలు

కూటమి కార్పొరేటర్లు	64
కూటమి ఎక్స్‌అఫిషియో సభ్యులు	11
వైసీపీ కార్పొరేటర్లు	30
వైసీపీ ఎక్స్ అఫీషియో సభ్యులు	3
తటస్థంగా ఉన్న కార్పొరేటర్లు	3



సిద్ధమైన జీవీఎంసీ సమావేశ మందిరం

11 గంటలకు సమావేశం ప్రారంభం

ఉదయం 11 గంటలకు అవిశ్వాస తీర్మానం కోసం కౌన్సిల్ సమావేశం ప్రారంభం కానున్నది. కోరం మేరకు కనీసం 74 మంది హాజరు కానట్టయితే 11.30 గంటల వరకూ వేచిచూస్తారు. అప్పటికి కోరం సరిపోతే అవిశ్వాస తీర్మానంపై సమావేశాన్ని జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ప్రారంభిస్తారు. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తారు. అవిశ్వాసానికి మద్దతుగా నిలిచేవారు చేతులు ఎత్తాల్సిందిగా కోరుతారు. వారి సంఖ్యను వరుసల వారీగా అధికారులు లెక్కిస్తారు. ఆ తర్వాత తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేసే వారిని చేతులు ఎత్తాల్సిందిగా కోరతారు. వారి సంఖ్యను లెక్కిస్తారు. ఈ ప్రక్రియను వీడియోలో రికార్డు చేస్తారు. అవిశ్వాస తీర్మానానికి 74 మంది కంటే ఎక్కువ మంది మద్దతు తెలిపితే మేయర్ గొలగాని హరివెంకటకుమారి పదవీచ్యుతులవుతారు. వీగిపోతే మాత్రం మేయర్‌గా ఆమె కొనసాగుతారు.

కేజీహెచ్‌లో ఇన్‌చార్జి మంత్రి తనిఖీలు

వైద్య సేవలు, సదుపాయాలపై ఆరా

- రూ.కోటితో క్యాజువాలిటీ అభివృద్ధి
- ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సీఎం లక్ష్యం
- మరో గైనకాలజీ వార్డు ఏర్పాటు
- వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆదేశం



సెలైన్ ఎక్కిస్తున్న నర్సింగ్ ఉద్యోగి ఆరోగ్యంపై ఆరా తీస్తున్న మంత్రి డోలా

మహారాణిపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం ఆయన కేజీహెచ్‌లో క్యాజువాలిటీ, పిడియాట్రిక్, గైనిక్ విభాగాలను సందర్శించి అందుతున్న సేవలు, సదుపాయాలపై రోగులతో మాట్లాడారు. అనంతరం ఎథిక్స్ గ్యాలరీలో విభాగాధిపతులు, వైద్యులతో సమావేశమై వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని, వైద్యులు, సిబ్బంది అందుకు అనుగుణంగా పనిచేయాలని అన్నారు. రూ.కోటితో క్యాజువాలిటీ విభాగాన్ని అభివృద్ధి చేస్తున్నామని, మరో గైనిక్ వార్డు ఏర్పాటు చేయనున్నట్టు ... మిగతా 6వ పేజీలో



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

52 వాహనాలు సీజ్

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు గురువారం రాత్రి నగరంలో ఆకస్మికంగా వాహనాల తనిఖీ చేపట్టారు. కీలకమైన 51 ప్రాంతాల్లో ఒక డీసీపీ, ఒక ఏడీసీపీ, ఇద్దరు ఏసీపీలు, 20 మంది సీఐలు, 30 మంది ఎస్‌ఐలు, 250 మంది సిబ్బందితో కలిసి 1,908 వాహనాలను తనిఖీ చేశారు. వాటిలో సరైన పత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లను సీజ్ చేశారు. అలాగే మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న ఏడుగురిపై కేసులు నమోదుచేశారు. ఇంకా హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్నందుకు 32 మందిపై, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న ఇద్దరిపై, లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతున్న ఒకరిపై కేసులు నమోదుచేశారు.

టీసీఎస్ ఆగమనం... ఐటీ అభివృద్ధికి సంకేతం

భవిష్యత్తులో విశాఖకు మరిన్ని ఐటీ, అనుబంధ కంపెనీలు

ఎంపీ ఎం.శ్రీభరత్

- టీసీఎస్ గురించి మాట్లాడే స్థాయి వైసీపీకి లేదు
- హెచ్‌ఎస్‌బీసీ వెళ్లిపోతున్నా ఆపలేకపోయారు
- ఉత్తరాంధ్రపై ఆ పార్టీవి దొంగ ఏడ్పులని విమర్శ
- అభివృద్ధిని చూసి ఓర్వలేకే జగన్ పార్టీ నాయకుల తప్పుడు ప్రచారం
- విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్. చిత్రంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు ఉన్నారు

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యంత విశ్వసనీయ సంస్థ టాటా గ్రూపునకు చెందిన టీసీఎస్‌కు నగరంలో ఎకరా రూ.0.99పైసలకు భూములు కేటాయించడాన్ని ఎంపీ ఎం.శ్రీభరత్ సమర్థించారు. గతంలో హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ వచ్చిన తరువాతే అనేక ప్రముఖ కంపెనీలు వచ్చాయని పేర్కొంటూ టీసీఎస్ వస్తే విశాఖకు మరిన్ని ఐటీ, అనుబంధ పరిశ్రమలు వస్తాయన్నారు.

శుక్రవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో టీసీఎస్ తొలి దశలో 12 వేల ఉద్యోగాలు కల్పిస్తుందని, ఆ తరువాత దశల వారీగా కార్యకలాపాలు విస్తరిస్తుందన్నారు. టీసీఎస్‌పై నమ్మకంతోనే ప్రభుత్వం భూములు ఇచ్చిందన్నారు. టీసీఎస్ రాక ఐటీ అభివృద్ధికి సిగ్నల్‌గా ఆయన అభివర్ణించారు. టీసీఎస్‌కు కారుచౌకగా భూములు ఇచ్చారని వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. టీసీఎస్ గురించి మాట్లాడే స్థాయి వైసీపీకి లేదన్నారు. విశాఖను ఐటీ హబ్ చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు ... మిగతా 6వ పేజీలో

మూతపడిన ఫిట్జీ

- రెండో ఏడాది ఫీజు కూడా గత ఏడాదే వసూలు చేసిన యాజమాన్యం
- కళాశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫిట్జీ జూనియర్ కళాశాల మూతపడింది. దీంతో విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం కళాశాల ఎదుట నిరసనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. ఇంటర్మీడియట్ పరీక్షలతో పాటు జేఈఈ, నీట్‌లకు విద్యార్థులను సన్నద్ధం చేస్తామంటూ భారీ ప్రకటనలతో ఫిట్జీ జూనియర్ కళాశాల దేశవ్యాప్తంగా బ్రాంచిలను ఏర్పాటుచేసింది. ఈ మేరకు నగరంలోని శాంతిపురం, ఎంవీపీ కాలనీల్లో రెండు ... మిగతా 6వ పేజీలో



ఫిట్జీ జూనియర్ కళాశాల ముందు నిరసన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

నెట్‌వర్క్ ఆస్పత్రులు క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ చేయాల్సిందే..

'ఆంధ్రజ్యోతి'తో ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకం జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కొయ్యాన అప్పారావు

- డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం
- నిరుపేదలకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- ఎవరికైనా ఇబ్బంది ఎదురైతే ఫిర్యాదు చేయవచ్చు
- డబ్బులు వసూలు చేసే ఆస్పత్రులకు జరిమానా
- కుటుంబానికి ఏడాదిలో రూ.25 లక్షల వరకూ ఉచితంగా వైద్యం

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకంలో నిరుపేద కుటుంబాలకు సంవత్సరానికి రూ.25 లక్షల వరకూ ఉచితంగా వైద్యం అందిస్తున్నట్టు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కొయ్యాన అప్పారావు తెలిపారు. క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించడంలో ఆస్పత్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో పథకం అమలు తీరు, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవల వివరాలను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.

ప్రశ్న: నెట్‌వర్క్ పరిధిలో ఉన్న ఆస్పత్రులు ఎన్ని?

జవాబు: ఎన్‌టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ పరిధిలో జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రులు కలిపి 108 వరకూ ఉన్నాయి. వీటిలో 63 ప్రైవేటు ఆస్పత్రులు కాగా, 45 ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి.

ప్ర: వైద్య సేవలు అందడంలో తలెత్తుతున్న ఇబ్బందులపై ఏమంటారు.?

జ: కొన్నిచోట్ల ఇబ్బందులు ఉన్నమాట వాస్తవమే. అనేక ఆస్పత్రులు నెట్‌వర్క్‌లో ఉండి కూడా ఎన్‌టీఆర్ వైద్య సేవ వర్తించదంటూ డబ్బులు వసూలు చేస్తున్నాయి. అటువంటి వాటిపై ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. ఆస్పత్రిలో ఉండగా గానీ, డిశ్చార్జ్ అయిన తరువాత గానీ 104కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఇటువంటి ఫిర్యాదులపై కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న డిస్ట్రిక్ డిసిప్లినరీ కమిటీ విచారణ జరిపి చర్యలు తీసుకుంటుంది. ఇప్పటి వరకూ అలా డబ్బులు వసూలుచేసిన 17 ఆస్పత్రులకు ఏడు లక్షల రూపాయల వరకు జరిమానా విధించాం. ఈ తరహా ఇబ్బందులు ఉంటే స్థానికంగా ఉండే ఆరోగ్య మిత్రకు కూడా తెలియజేయవచ్చు. ప్రభుత్వం ఆస్పత్రులకు డబ్బులు చెల్లిస్తోంది. కాబట్టి, రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. డబ్బులు అడిగితే వెంటనే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

ప్ర: జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య ఎంత?

జ: జిల్లాలో 4,85,745 కార్డుల్లో సుమారు 12 లక్షల మంది వరకూ సభ్యులు ... మిగతా 6వ పేజీలో



డాక్టర్ కొయ్యాన అప్పారావు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అంతా గజిబిజి

» అస్తవ్యస్తంగా ఆనందపురం హైవే డిజైన్
» నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులతో ప్రయాణికుల నరకయాతన

ఆనందపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి నుంచి ఆనందపురం జాతీయ రహదారి నిర్మాణం డిజైన్ లోపం స్థానిక ప్రజలతో పాటు ప్రయాణికులకు శాపంగా మారింది. ఈ మార్గంలో తొలుత కోల్‌కత్తా నుంచి విశాఖపట్నం హైవే నిర్మాణం జరిగింది. వాహనాల రాకపోకలకు రెండు రోడ్లు ఉండడంతో ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రయాణాలు సాఫీగా సాగాయి. ఆనందపురం జంక్షన్‌తో సంబంధం లేకుండా వాహనాలు హైవే వంతెనపై నుంచి నేరుగా వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య ఉండేది కాదు. కానీ కొత్తగా చేపట్టిన జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా అనకాపల్లి నుంచి ఆనందపురం జంక్షన్ వరకూ జరిగిన రోడ్డు నిర్మాణంలో ఇంజినీరింగ్ అధికారులు చేసిన తప్పిదం పలు సమస్యలకు కారణమైంది. ఆనందపురం దగ్గర రోడ్డు డిజైన్‌లో చేసిన పొరపాటు ప్రయాణికులు, స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తోంది. అటు అనకాపల్లి నుంచి ఇటు విశాఖ నుంచి వస్తున్న వాహనాలు ఆనందపురం హైవే బ్రిడ్జి మీద డైవర్షన్ కుదరకపోవడం విశాఖ నుంచి వచ్చిన వాహనాలను ఆనందపరం జంక్షన్ కిందకు మళ్లించి అక్కడి నుంచి మళ్లీ సర్వీసు రోడ్డు మీదుగా హైవేకి పంపించడం పెద్ద సమస్యగా మారింది. విశాఖ నుంచి నిత్యం కొన్ని వేల వాహనాలు ఆనందపురం జంక్షన్ మీ దుగా హైవేకి వెళ్లడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో పాటు వాహనదారులకు రెండు కిలోమీటర్లు అదనంగా ఇంధనం ఖర్చు అవుతుంది. అంతేకాదు కొన్ని వేల వాహనాలు ఆనందపురం రోడ్డులో నుంచి ఊరిలోకి వెళ్లి హైవేకి చేరుతున్నాయి. ఈ రోడ్డు చాలా ఇరుగ్గా ఉండడంతో వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. అలాగే పూల మార్కెట్ ఉండడం వద్ద తరచూ ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి.


ఆనందపురం ఫ్లైఓవర్ కింద నుంచి వెళుతున్న విశాఖ నుంచి వస్తున్న వాహనాలు


ఆనందపురం సర్వీసు రోడ్డు నుంచి హైవేలోకి వెళుతున్న వాహనాలు

డిజైన్‌లో చేయాల్సిన మార్పులు

అనకాపల్లి నుంచి ఆనందపురం రోడ్డు డిజైన్ చేసిన అధికారులు ఆనందపురం దగ్గర సర్కిల్ నిర్మించి వాహనాలు వెళ్లడానికి సదుపాయం కల్పించాలి. విశాఖ నుంచి వస్తున్న వాహనాలు, అనకాపల్లి వైపుగా వస్తున్న వాహనాలు రెండు దారులుగా హైవేను కలపాల్సి ఉంది. అలా కాకుండా అనకాపల్లి నుంచి వచ్చే రహదారిని నేరుగా విశాఖ నుంచి వచ్చే రోడ్డుకు కలిపివేయడంతో రెండువైపులా వాహనాలు ఒకేసారి ఒకే పాయింట్‌లో కలవడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో హైవే అధికారులు తప్పును కప్పిపుచ్చుకుని విశాఖ నుంచి వచ్చే వాహనాలను ఆనందపురం ఊరిలో నుంచి మార్కెట్ మీదుగా సర్వీసు రోడ్డులో నుంచి పంపిస్తున్నారు. ఆనందపురం ప్రజలు కూడా రోడ్డు మీదకు రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రావాల్సిన పరిస్థితి. ఈ సమస్యను పరిష్కరించాలని హైవే ఉన్నతాధికారులను స్థానిక రాజకీయ నాయకులు, వివిధ సంఘాలు పలుమార్లు కోరినా.. ఫలితం ఉండడం లేదు.


హేమంత్ కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

హేమంత్ కుటుంబాన్ని ఆదుకుంటాం

» ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు » రూ. 15 లక్షల నష్టపరిహారం అందజేత

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలంలోని కైలాసపట్నంలో జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో మృతి చెందిన హేమంత్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మహాలక్ష్మీపురం గ్రామానికి వెళ్లి హేమంత్ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 15 లక్షల నష్టపరిహారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, టీడీపీ మండల అధ్యక్షుడు రాజు, జనసేన నాయకులు శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత సీట్ల భర్తీకి దరఖాస్తులు

మధురవాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : విద్యా హక్కు చట్టం ప్రకారం అన్ని ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు పాఠశాలలో ఉన్న మొత్తం సీట్లలో 25 శాతం నిరుపేద పిల్లలకు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈమేరకు మధురవాడ, పీఎంపాలెం ప్రాంతాల్లో 20 ప్రైవేటు పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. విద్యార్థులు ఈనెల 28 నుంచి మే 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ సిలబస్ ఉన్న పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి ఈఏడాది మార్చి 31వ తేదీకి ఐదేళ్లు పూర్తి కావాలి. స్టేట్ సిలబస్ ఉన్న పాఠశాలల్లో చేరడానికి జూన్ 1వ తేదీ నాటికి ఐదేళ్లు పూర్తి కావాల్సి ఉంది.అలాగే తల్లిదండ్రులు తమ ఆధార్ కార్డు, విద్యార్థి ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, రేషన్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, విద్యుత్ బిల్లుల్లో ఏదో ఒకటి చిరునామాగా చూపించాలని అధికారులు తెలిపారు. అర్హులైన వారు తమ దరఖాస్తులను సీఎస్‌ఈ.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో పంపించాల్సి ఉంది.

చేపల దిబ్బడిపాలెం మత్స్యకార కోఆపరేటివ్ సొసైటీ ఎన్నిక


నూతన కార్యవర్గంతో మత్స్యకార నాయకులు, అధికారులు

భీమునిపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాలుగో వార్డు చేపల దిబ్బడిపాలెం ఫిషర్ మెన్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా సూరాడ పెద్దయ్య ఎన్నికయ్యారు. శుక్రవారం ఆ గ్రామంలో మత్స్యశాఖాధికారి మురళీ ఆధ్వర్యంలో సొసైటీ ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా ఉమ్మిడి దాసు, మరో అయిదుగురు డైరెక్టర్లను సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పెద్దయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను సభ్యులకు వర్తించేలా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె. అప్పారావు, చేపల దిబ్బడిపాలెం గ్రామ పెద్దలు కె. ముల్లయ్య, సీహెచ్ అమ్మోరు, యు.మహేశ్, డి. గోపి, వి. భీమారావు, వెంకటరావు, ఎస్. చిట్టిబాబు, యు. రాము, టీఎన్ ఎస్ఎఫ్ నాయకుడు ఎస్. రవి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని మహారాణిపేట ప్రాంతానికి చెందిన బి. శివరావు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని ఆయన చెక్కు రూపంతో దేవస్థానం ప్రొటోకాల్ విభాగం పర్యవేక్షణాధికారి సివివి పద్మనాభరాజు (విక్రమ్)కు శుక్రవారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాత కుటుంబ సభ్యులకు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి శేషవస్త్రంతో సత్కరించారు.

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఎంపిక పట్ల హర్షం

పద్మనాభం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ జాబితాలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు స్థానం లభించడం పట్ల మాజీ ఎంపీపీ కాళ్ల పద్మ, టీడీపీ సీనియర్ నాయకుడు నగేశ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉత్తమ నాయకత్వం, లీడర్ షిప్‌పై 50 దేశాల నుంచి 116 మందిని ఎంపిక చేయగా అందులో రామ్మోహన్‌నాయుడు పేరు ఉండడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రై డే

భీమునిపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ గుడ్ ఫ్రై డే వేడుకలను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భీమిలి పట్టణంలోని రోమన్ కేథలిక్ మిషన్ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు యేసును శిలువ వేసిన ఘట్టాలను వీధుల్లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ మానవాళిని పాపాల నుంచి రక్షించేందుకు యేసు అవతరించారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ వై. అల్ఫోన్స్, సిస్టర్స్, సంఘ సభ్యులు, పాల్గొన్నారు. అలాగే ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిలోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మధురవాడ : జీసస్ త్యాగం ఆదర్శనీయమని క్రైస్తవ మత పెద్దలు పేర్కొన్నారు. గుడ్ ఫ్రై డే సందర్భంగా మధురవాడ పరిసరాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని ఎస్ఎఫ్ఎస్ చర్చిలో క్రీస్తు శిలువ మోస్తున్న ఘట్టాన్ని ప్రదర్శించారు. స్వతంత్రనగర్ కాలనీ, మధురవాడ కూడలిలోని క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లోనూ ప్రార్థనలు జరిగాయి. పోతిన మల్లయ్యపాలెం ఏపీహెచ్‌బీ కాలనీలోని లౌఅండ్ కేర్ మినిస్ట్రీస్ చర్చిలో రెవరెండ్ పి. ఏసుపాదం దైవ సందేశాన్ని వినిపించారు. జీసస్ శిలువపై పలికిన ఆఖరి మాటలను క్రైస్తవులు ఎల్లవేళలా గుర్తుంచుకొని, అందుకు అనుగుణంగా నడచుకోవాలని కోరారు.


భీమిలిలో : ఏసుకు శిలువ వేసే ఘట్టం ప్రదర్శన

సాగర్‌నగర్ : సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాల్లోని చర్చిల్లో గుడ్ ఫ్రై డే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాగర్ నగర్‌లోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు అనంతరం పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వినించారు.

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు గుడ్ ఫ్రై డే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పద్మనాభం, రేవిడి, కోరాడ, పొట్నూరు, అనంతవరం, అయినాడ గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనలు జరిపారు. కార్యక్రమాల్లో పాస్టర్లు జాన్ విక్టర్, అబ్రహాం, తదితరులు పాల్గొన్నారు.


మహిళా రైతును సన్మానిస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పద్మనాభం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెంట గ్రామంలో వ్యవసాయాధికారులు ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ బోదల పావని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే భూ సంరక్షణ, ఆరోగ్యకరమైన పంటల సాగు గురించి వివరించారు.

మూతపడిన ఫిట్జీ

... 5వ పేజీ తరువాయి

బ్రాంచీలను తెరిచింది. ఒక్కో విద్యార్థి నుంచి ఏడాదికి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఫీజుగా వసూలు చేసింది. ఎంవీపీ బ్రాంచిలో గత విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో సుమారు 220 మంది చేరారు. విద్యా సంవత్సరం సగం కూడా గడవక ముందే రెండో ఏడాది ఫీజునూ వసూలు చేశారు. ఇదిలావుండగా అక్టోబరు నుంచే గడ్డుకాలం ప్రారంభమయింది. యాజమాన్యం జీతాలు ఇవ్వడం లేదంటూ అధ్యాపకులు ఒక్కొక్కరుగా కళాశాలను విడిచిపెట్టి వెళ్లిపోయారు. పరీక్షల ముందు ఈ పరిస్థితి తలెత్తడంతో కొంతమంది తమ పిల్లలను ఇతర కళాశాలల్లో చేర్పించారు. మిగిలిన వారు అక్కడే పరీక్షలు రాశారు. వచ్చే విద్యా సంవత్సరంలో కూడా క్లాసులు నడిచే పరిస్థితి లేకపోవడంతో తాము చెల్లించిన ఫీజు వాపసు చేయాలని తల్లిదండ్రులు కళాశాల చుట్టూ తిరుగుతున్నారు. ఆ లేఖలు ఢిల్లీలో ఉన్న యాజమాన్యానికి పంపించడం మినహా తాము ఏమీ చేయలేమని సిబ్బంది చెబుతున్నారు. విద్యార్థుల జీవితంతో ఆడుకున్న ఫిట్జీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం కళాశాల ఎదుట నిరసన తెలిపిన అనంతరం ఎంవీపీ పోలీసులను ఆశ్రయించారు. ప్రస్తుతం కళాశాలలో ముగ్గురు కింది స్థాయి సిబ్బంది మాత్రమే ఉన్నారు. శాంతిపురం బ్రాంచి వద్ద కూడా బోర్డు కూడా తొలగించారు.

చర్యలు తీసుకుంటాం

కళాశాల మూసివేయాల్సిన పరిస్థితి వస్తే, విద్యార్థులకు ప్రత్యామ్నాయం చూపించాలి. తల్లిదండ్రులు ఒకేసారి రెండు సంవత్సరాల ఫీజు చెల్లించకూడదు. అర్ధంతరంగా మూసివేసిన ఫిట్జీ జూనియర్ కళాశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- పి.మురళీధర్, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి, ఇంటర్ బోర్డు

నేడు అవంతిలో పరిశ్రమల హెచ్‌ఆర్‌ల సదస్సు

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస లోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పరిశ్రమల హెచ్‌ఆర్‌ల సదస్సు జరగనున్నట్టు కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు జిల్లాలోని పలు పరిశ్రమల హెచ్‌ఆర్‌లు హాజ రుకానున్నట్టు చెప్పారు. వారు ఆయా పరిశ్రమల్లో ఉన్న ఉద్యోగావకాశాలు గురించి వెల్లడిస్తారన్నారు.

మహా ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

టీడీపీ నుంచి గెలిచిన ఒకరు వైసీపీలో చేరిపోయారు. ఆ తర్వాత జరిగిన 32వ వార్డు ఉప ఎన్నికల్లో టీడీపీ స్థానాన్ని వైసీపీ దక్కించుకోవడంతో కౌన్సిల్‌లో ఆ పార్టీకి ఎదురులేకుండాపోయింది. అయితే 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో కౌన్సిల్‌లో సమీకరణాలు తలకిందులైపోయాయి. వైసీపీ నుంచి గెలిచిన 19 మంది కార్పొరేటర్లు టీడీపీలో, మరో తొమ్మిది మంది జనసేనలో చేరిపోయారు. ఇండిపెండెంట్లుగా గెలిచిన నలుగురిలో ఇద్దరు టీడీపీ, మరో ఇద్దరు జనసేనలో చేరిపోయారు. ఈ నేపథ్యంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాసం ప్రకటిస్తూ కూటమి కార్పొరేటర్లు 58 మంది సంతకాలు చేసి గత నెల 21న జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్‌కు నోటీస్ ఇచ్చారు. అందులో సంతకాల ధ్రువీకరణ అనంతరం అవిశ్వాస తీర్మానంపై శనివారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు.

తీర్మానం నెగ్గాలంటే 74 మంది సభ్యుల మద్దతు అవసరం

మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై శనివారం ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే కూటమికి 74 మంది సభ్యుల మద్దతు అవసరం. జీవీఎంసీలో 97 మంది కార్పొరేటర్లతోపాటు 14 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు కలుపుకుని 111 మంది ఓటుహక్కు కలిగిన సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం టీడీపీకి 48, జనసేనకు 14, బీజేపీకి ఇద్దరు కార్పొరేటర్లు మొత్తం కూటమికి 64 మంది కార్పొరేటర్ల బలం ఉంది. వైసీపీకి 30 మంది, సీపీఐ, సీపీఎంకి ఒక్కొక్కరు ఉన్నారు. ఇటీవలే వైసీపీకి రాజీనామా చేసిన ఆరో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక (మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుమార్తె) తన వైఖరిని ఇంకా ప్రకటించలేదు. సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానంపై జరిగే సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. వైసీపీ కూడా సమావేశాన్ని బహిష్కరించాలని నిర్ణయించింది. కూటమి చేతిలో ఉన్న 64 మంది కార్పొరేటర్లతోపాటు 11 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు సమావేశానికి హాజరైతే అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు అవకాశం ఉంటుంది. వీరితోపాటు ముత్తంశెట్టి ప్రియాంక కూడా హాజరయ్యే అవకాశం ఉందంటున్నారు.

వైరివర్గాల్లోని సభ్యుల కోసం కొనసాగుతున్న నేతల వేట

అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు కూటమికి 74 మంది సభ్యుల మద్దతు తప్పనిసరి. అయితే ఆ సంఖ్యను చేరకుండా వైసీపీ నేతలు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అందుకోసం కొద్దిరోజుల కిందట వరకు తమ పార్టీలో ఉండి ప్రస్తుతం కూటమిలో చేరిన కార్పొరేటర్లను తిరిగి తమ వైపు లాక్కోవాలని చూస్తున్నారు. తెలుగుదేశం కార్పొరేటర్లంతా శుక్రవారం రాత్రి వరకూ మలేషియాలో ఉండడంతో నగరంలో ఉన్న వారి కుటుంబసభ్యుల ద్వారా సంప్రతింపులు జరిపినట్టు తెలిసింది. ఒకరిద్దరు కార్పొరేటర్లను భారీ నజరానా ఆశ చూపించి కౌన్సిల్ సమావేశానికి హాజరుకాకుండా నిరోధించడం లేదంటే కౌన్సిల్‌కు హాజరైనా సరే అవిశ్వాసానికి మద్దతుగా చెయ్యి ఎత్తకుండా ఉండిపోయేలా ఒప్పందం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతుండడం కూటమి నేతలను ఆందోళనకు గురిచేస్తోంది. గాజువాక ప్రాంతానికి చెందిన ఒక కార్పొరేటర్ మలేషియా విమానాశ్రయం నుంచి తప్పించుకుని వెళ్లిపోయారని ప్రచారం జరుగడంతో కూటమి నేతలు అప్రమత్తమై ప్రతి కార్పొరేటర్ వెనుక ప్రత్యేకంగా మనుషులను కాపలా పెట్టుకున్నారు. మరోవైపు కూటమి నేతలు కూడా తమలో కొందరు దెబ్బకొట్టినా సరే అవిశ్వాస తీర్మానం నెగ్గేలా ముందుజాగ్రత్తగా వైసీపీలోని ఇద్దరు, ముగ్గురు సభ్యులను తమ వైపు తిప్పుకునేందుకు యత్నిస్తున్నారు. అందుకోసం కేరళ, శ్రీలంకలో ఉన్న వైసీపీ కార్పొరేటర్ల వద్దకు మనుషులను పంపించినట్టు సమాచారం. వీలైతే రాత్రికే వారిని అక్కడి నుంచి నగరానికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇరువర్గాలు ఎత్తుకు పైఎత్తులు వేస్తుండడంతో ఫలితం ఎలా ఉంటుందనే ఉత్కంఠ నెలకొంది.

టీసీఎస్ ఆగమనం..ఐటీ అభివృద్ధికి సంకేతం

... 5వ పేజీ తరువాయి

భవిష్యత్తులో మరిన్ని కంపెనీలు రానున్నాయన్నారు. రుషికొండలో ఇన్ఫోసిస్ కార్యకలాపాలు విస్తరిస్తోందని పేర్కొన్నారు. రుషికొండ ఐటీ పార్కులో మౌలిక సదుపాయాల కల్పనలో గత వైసీపీ ప్రభుత్వం విఫలమైందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వీధి లైట్లు ఏర్పాటుచేయడం, బస్ సౌకర్యం కల్పించడం వంటివి చేశామన్నారు. ఐటీ కంపెనీలకు పెండింగ్‌లో పెట్టిన ఇన్సెంటివ్‌లను దశల వారీగా విడుదల చేస్తున్నామని వెల్లడించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వైసీపీ దొంగ ఏడ్పులు ఏడుస్తోందని శ్రీభరత్ విమర్శించారు. గత ఐదేళ్లలో ఉత్తరాంధ్రను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన విషయం మరిచిపోయి, ఇప్పుడు అబద్ధపు ప్రచారానికి పాల్పడుతుందని దుయ్యబట్టారు. రెండు దశాబ్దాల క్రితం విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించిన హెచ్‌ఎస్‌బీసీ నగరం నుంచి తరలిపోతున్నా కనీసం వారిని పిలిచి మాట్లాడలేదన్నారు. టీసీఎస్‌కు కారుచౌకగా భూమి ఇచ్చారని గోబెల్స్ ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకులు, ఒక వ్యక్తి కోసం రూ.450 కోట్లతో రుషికొండపై ప్యాలెస్ ఎందుకు కట్టారో చెప్పాలన్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దృష్టిసారించిందని శ్రీభరత్ పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తయ్యేనాటికి విశాఖ నుంచి కనెక్టవిటీ పెంపునకు వీఎంఆర్‌డీఏ రూ.400 కోట్లతో 17 మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మించనున్నదన్నారు. విశాఖ నుంచి విమానాల రద్దుపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో మాట్లాడామని, రైల్వే జోన్ కార్యకలాపాలు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. లులు కంపెనీ రూ.1800 కోట్ల పెట్టుబడులు పెడుతుందని, దీని వల్ల విశాఖలో టూరిజం విస్తరిస్తుందన్నారు. లులూ కంపెనీ విశాఖతో పాటు విజయవాడ, రాజమండ్రి, తిరుపతిలో మాల్స్ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు.

విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో అభివృద్ధి చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి కారణమైన వారికి మాట్లాడే హక్కులేదన్నారు. గడచిన పది నెలల్లో విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ.11,404 కోట్లు సాయం అందించామన్నారు. వైసీపీ నాయకులు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని అప్పలనాయుడు అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి నారా లోకేశ్‌లు ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దృష్టిసారించారన్నారు. విలేకరుల సమావేశంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, పాల్గొన్నారు.

'సచివాలయాల మార్పు సరికాదు'

తగరపువలస, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నాలుగు గ్రామాలకు అందుబాటులో ఉన్న బొగ్గు రోడ్డు గ్రామ సచివాలయాలను తగరపువలసకు మార్పు చేయడం సరికాదని వైసీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.2వ వార్డులో అద్దె భవనాల్లో ఉన్న సచివాలయాలను తగరపువలస సచివాలయాలు ఉన్న ఆవరణలోకి మార్పు చేయడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వారు తగరపువలస వెళ్లడానికి వ్యయప్రయాసాలకు గురవుతున్నారన్నారు.

విద్యుత్ వైర్లు మార్పు చేయాలని ధర్నా

తగరపువలస, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : బాలాజీ నగర్ సమీపంలో ఉన్న యాతపేట మహిళలు ఇళ్లపై ఉన్న విద్యుత్ వైర్లను మార్పు చేయాలని డిమాండ్ చేస్తూ రహదారిపై శుక్రవారం ధర్నా చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్. అప్పలనాయుడు, ఆర్. నరసింగరావు మాట్లాడుతూ జీవీఎంసీ ఒకటి, రెండు వార్డుల మధ్యలో ఉన్న యాతపేటలో వైర్లు ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. వాటి వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అధికారులు తక్షణమే వాటిని వేరే చోటకు మార్పు చేయాలని కోరారు. అనంతరం చిట్టివలస సబ్ స్టేషన్ సహాయ ఇంజనీర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రీసు నరసింగరావు చిన్నారావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయంపై నిర్లక్ష్యం!

... 5వ పేజీ తరువాయి

ఎక్కడికైనా సరే విశాఖపట్నం మీదుగానే వెళ్లాలి. ఇక్కడి విమానాశ్రయంలోనే విమానం ఎక్కాలి. ఓ అరగంట సమయం కేటాయించి ఇక్కడి సమస్యలపై దృష్టిసారించాలని నగరవాసులు కోరుకుంటున్నారు. రద్దయిన విమానాలు వెంటనే పునరుద్ధరణ జరిగేలా, కొత్త సర్వీస్‌లు వచ్చేలా చేయాల్సిన ఆవశ్యకత చాలా ఉంది. గతంలో విశాఖ నుంచి దుబాయ్‌కు అంతర్జాతీయ విమాన సర్వీస్ ఉండేది. వాస్తవానికి ఇక్కడి నుంచి ప్రారంభమైన తొలి విదేశీ విమానం అదే. ఇండియన్ ఎయిర్‌లైన్స్ నడిపింది. కరోనా సమయంలో రద్దయిన ఆ విమానం మళ్లీ పునరుద్ధరణ జరగలేదు. విశాఖ కంటే అనేక విధాలుగా తరువాత స్థానంలో విజయవాడకు మాత్రం దుబాయ్ విమానం నడుస్తోంది. కేంద్ర మంత్రి తక్షణమే విశాఖలో ఓ సమావేశం ఏర్పాటుచేసి, విమాన సర్వీస్‌లతో పాటు కార్గో సేవలు కూడా ప్రారంభమయ్యేలా చూడాల్సి ఉంది. ఉడాన్ యాత్రీ క్యాంటీన్ రుచులను ఇక్కడి ప్రయాణికులకు పరిచయం చేసే బాధ్యత తీసుకోవాలి.

నెట్‌వర్క్ ఆస్పత్రులు క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ చేయాల్సిందే..

... 5వ పేజీ తరువాయి

ఉన్నారు. వారితోపాటు ఉద్యోగుల హెల్త్ స్కీమ్ పథకంలో భాగంగా రెండు లక్షల కుటుంబాలకు, జర్నలిస్టు హెల్త్ స్కీమ్ కింద మరో వేయి మంది కుటుం బాలకు అందించే వైద్య సేవలను పర్యవేక్షిస్తున్నాం. వీరికి ఏ ఇబ్బందులు ఉన్నా మాకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

ప్ర: ఆయుష్మాన్ భారత్ పథకం లబ్ధిదారులు ఎంతమంది?

జ: కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఉచితంగా నిరుపేదలకు వైద్య సేవలు అందించేందుకు హెల్త్ కార్డులు అందిస్తోంది. ఈ పథకానికి జిల్లాలో 9,11,697 మంది అర్హులుగా గుర్తించింది. వీరిలో ఇప్పటి వరకూ 6,95,049 మందికి ఈకేవైసీ పూర్తి చేశాం. కార్డులు పంపిణీ ప్రక్రియను కూడా త్వరలోనే పూర్తిచేస్తాం. ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్‌లో ఉన్న ఆస్పత్రులన్నింటిలోనూ దాదాపు ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఉచిత వైద్య సేవలు అందుతాయి. ఈ పథకంలో భాగంగా ఐదు లక్షల వరకూ ఉచిత ఆరోగ్య బీమా లభిస్తుంది. 70 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఈ కార్డులను అందిస్తున్నాం.

ప్ర: సమస్యలుంటే ఎవరిని సంప్రతించాలి?

జ: ఆస్పత్రిలో చేరిన దగ్గర నుంచి డిశ్చార్జ్ అయ్యేంత వరకు ఎటువంటి సమస్య ఉన్నా ఫిర్యాదు చేయవచ్చు. ఆరోగ్య మిత్రలు ప్రతి రోజూ బెడ్‌సైట్ విజిట్ చేయాలి. క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ చేయించే బాధ్యత ఆరోగ్య మిత్రలపై ఉంటుంది. నేను కూడా టీమ్‌తో ప్రతిరోజూ కనీసం మూడు నుంచి ఐదు ఆస్పత్రులు విజిట్ చేస్తుంటా. రోగులతో స్వయంగా మాట్లాడి ఇబ్బందులు తెలుసుకుంటాం.కొన్నిసార్లు డిశ్చార్జ్ అయి వెళ్లిన రోగులతో ఫోన్‌లో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందాయన్న విషయాన్ని కూడా తెలుసుకుంటాం.

కేజీహెచ్‌లో ఇన్‌చార్జి మంత్రి తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

వెల్లడించారు. మూడు నెలల్లో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. వైద్యులు, సిబ్బంది రోగులకు సంతృప్తికరమైన సేవలు అందించాలని ఆదేశించారు. సెక్యూరిటీ, పారిశుధ్య సేవలను మరింత మెరుగుపరచాలని, యూజీడీ వ్యవస్థలో లోపాలను సరిచేయాలని సూచించారు. దశల వారీగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని మంత్రి తె=లిపారు. ఫార్మసీ కౌంటర్లు పెంచాలని, టోకెన్ డిస్‌ప్లే వ్యవస్థను అమలు చేయాలని సూచించారు. కేజీహెచ్‌లో అదనపు పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కేవలం కేజీహెచ్‌పై భారం పడకుండా అనుబంధ ఆసుపత్రుల్లో మెడికో లీగల్ కేసుల పరీ క్షలు నిర్వహించాలని మంత్రి సూచించారు. జనన ధ్రువీకరణ, శిశు ఆధార్ కేంద్రాలు ఏర్పా టు చేయనున్నట్టు వెల్లడించారు. ఏఎంసీ విద్యార్థుల కోసం గ్యాలరీలు ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి డోలా తెలిపారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. దక్షిణ నియోజకవర్గ శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవి లత, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి, ఆర్ఎంవో డాక్టర్ మెహర్ కుమార్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

» ఉదయం నుంచి చర్చిల్లో సందడి » ప్రత్యేక ప్రార్థనలు » కీర్తనలు ఆలపిస్తూ ఏసుక్రీస్తు ఆరాధన



వెంకోజీపాలెం : కీర్తనలు ఆలపిస్తున్న సియోను చర్చి ప్రతినిధులు, క్రీస్తు ఆరాధకులు





ఆరిలోవ : ప్రార్థనలు చేస్తున్న క్రీస్తు ఆరాధకులు, శిలువ మోస్తున్న విశ్వాసకులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని జీవీఎంసీ 16వ వార్డు భానునగర్ సీయోను మందిరంలో శుక్రవారం పాస్టర్ వంక శివశంకర్ లాజరస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పాడేరు వెళ్లి అక్కడ గిరిజన ప్రాంతంలో యేసుక్రీస్తు ప్రార్థనలు చేసి, యేసు పాటలను ఆలపిస్తూ, ఏసు గొప్పతనాన్ని తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేసినట్టు తెలిపారు. శిలువతో కూడిన యేసు ప్రతిమను మోస్తూ పాడేరు గిరిజన, కొండవాలు ప్రాంతంలోనూ, మద్దిలపాలెం, చర్చి చుట్టుపక్కలా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి గిరిజన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ వంక శివశంకర్ లాజరస్, ఎ.రాజకుమార్, ఇతర చర్చి సభ్యులు, స్థానిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గుడ్ ఫ్రైడే పురస్కరించుకొని ఆరిలోవ ఆర్‌సీఎం చర్చిలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ జోసెఫ్ అని తొట్టం, ఫాదర్ విజయకుమార్ ఫాదర్ ఎస్ థామస్ పలువురు మత పెద్దలు సభ్యులు విచారణ కన్యస్త్రీలు భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా శిలువ ఆరాధన, శిలువ ముద్దు వంటికార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పెదగదిలి, ఈశ్వరదేవీనగర్‌లోగల నోబుల్ చర్చిల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అధిక సంఖ్యలో ఏసు ఆరాధకులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీరామ పట్టాభిషేకం



సంజీవనగర్ కాలనీలో నిర్వహించిన సీతారాముల పట్టాభిషేకం

ఆరిలోవ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సంజీవనగర్ కాలనీలో వెలిసిన మహాగణపతి సీతారామలక్ష్మణ అభయాంజనేయస్వామి సహిత సాయినాథ దేవాలయం అష్టమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం సీతారాముల పట్టాభిషేకం కన్నుల పండవగా నిర్వహించారు. అనంతరం నారాయణ సేవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం నెహ్రూ యుజన సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నారాయణ సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని అనిల్‌కుమార్ రాజు ఆర్థిక సహాయంతో చేపట్టారు.

సీఆర్పీఎఫ్ ఐజీ శ్రీనివాస్‌కు పోలీసు మెడల్ ఫర్ డిస్టింగిస్ట్ అవార్డు



కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేతుల మీదుగాఅవార్డు అందుకుంటున్నశ్రీనివాస్

ఆరిలోవ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : విశాలాక్షి నగర్ కైలాసగిరిలో గల కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) ఐజీ ఆరాధ్యుల శ్రీనివాస్‌కు ఢిల్లీలో సీఆర్పీఎఫ్ 86వ వార్షికోత్సవాల్లో భాగంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా ప్రెసిడెంట్ పోలీసు మెడల్ ఫర్ డిస్టింగిష్ట్ సర్వీస్ అవార్డు అందుకున్నారు. ఆయన 34 ఏళ్లకు పైగా విశిష్ట సేవలను అందించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

విమ్స్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ పనులు

ఆరిలోవ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్) ప్రాంగణంలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులను గత నాలుగు రోజుల నుంచి చేపడుతున్నారు. పాత జాతీయ రహదారి నుంచి విమ్స్‌లో గల విద్యుత్ కార్యాలయం వరకూ ఈ పనులు చేపడుతున్నారు. పాత్‌వేకు ఆనుకొనిఈ పనులు జరుగుతున్నాయి. అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ పనులు పూర్తిగా అయినట్లయితే ఇక విద్యుత్ స్తంభాల అవసరం ఉండదు. దీనివల్ల తరచూ ఎదురయ్యే విద్యుత్ అంతరాయం సమస్య తగ్గుతుందని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

సినిమా గైడ్

● **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిలిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)

● **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)

● **జాక్ :** రమాదేవి

● **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 18, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 26, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 32, బీరకాయలు 40, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 14, క్యారెట్ 30 దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 26, క్యాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు	
బ్రాయిలర్	
రైతు ధర	104
లైవ్ ధర	124
విత్ స్కిన్	218
స్కిన్‌లెస్	228

అసంపూర్తి ఇళ్లకు బిల్లులు

» జియోట్యాగింగ్‌తో మోసాలు
» విజయరాంపురం లే అవుట్‌లో 182 ఇళ్లపై ఫిర్యాదు

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం హయాంలో నగర శివారు ప్రాంతాల్లో సెంటు స్థలంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్కడక్కడా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండానే బిల్లులు చెల్లిస్తున్నారనే వాదన ఉంది. జియోట్యాగింగ్ సాయంతో ఎవరికి అనుమానం రాకుండా చేయని పనులకు బిల్లులు మంజూరుచేస్తున్నారని తాజాగా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. పద్మనాభం మండలం విజయరాంపురం లే అవుట్‌లో 182 ఇళ్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు భిన్నంగా జియోట్యాగింగ్ చేసి కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నగర శివార్లలో 65 లే అవుట్‌లలో లక్షకు పైగా ఇళ్లు నిర్మిస్తున్నారు. అయితే ఇళ్ల నిర్మాణాలకు ముందు నగరంలో ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారులకు తీసుకెళ్లి వారికి కేటాయించిన ప్లాటు ముందు నిలబెట్టి ఫొటోలు తీసి జియో ట్యాగింగ్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. దశల వారీగా లబ్ధిదారులకు ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తరువాత బిల్లులు చెల్లిస్తారు. అయితే నగరంలో 22వ వార్డుకు చెందిన వారికి పద్మనాభం మండలం విజయరాంపురం, మద్ది, ఆనందపురం మండలం గొట్టిపల్లిలో ప్లాట్లు మంజూరు చేశారు. విజయరాంపురంలో కొన్ని ఇళ్లకు సంబంధించి పనులు పూర్తి చేయకుండానే నిర్మాణాలు జరిగినట్టు ఆన్‌లైన్‌లో చూపించారు. ఉదాహరణకు లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్ల వద్ద కాకుండా సమీపంలో దాదాపు నిర్మాణాలు పూర్తియిన ఇళ్ల వద్ద నిల్చోబెట్టి ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారనే విషయం తాజాగా వెలుగులోనికి వచ్చింది. దీనిపై లబ్ధిదారులకు అనుమానం వచ్చి వార్డు కార్యదర్శులు, హౌసింగ్ అధికారులను నిలదీశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

భారీ వ్యత్యాసం

విజయరాంపురంలో కాకుండా మద్ది, గొట్టిపల్లి లే అవుట్‌లలో క్షేత్రస్థాయిలో నిర్మాణాలకు, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన బిల్లులకు మధ్య వ్యత్యాసం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్న 112 ఇళ్లు గోడల వరకు నిర్మాణాలు పూర్తిచేసినట్టు వివరించారు. గొలగాని శైలజ అనే లబ్ధిదారునికి చెందిన ఇళ్లు రూఫ్ కాస్ట్ (స్లాబ్ వేయడం) వరకు పనులు చేపట్టగా ఆన్‌లైన్‌లో మాత్రం మొత్తం ఇంటినిర్మాణం పూర్తియిందని చూపించారు. పల్లా భాగ్యశ్రీ అనే లబ్ధిదారునికి చెందిన ఇళ్లు పునాది కోసం కాలమ్స్ వేసి గ్రావెల్ కప్పి అక్కడ కొన్ని ఇటుకలు ఉండగా నిర్మాణం పూర్తయినట్టు చూపించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మండపాక జ్యోతికు కేటాయించిన ప్లాటులో పునాది వరకు మాత్రమే పనులు జరగ్గా ఆన్‌లైన్‌లో మాత్రం స్లాబ్ పూర్తిచేసినట్టు పేర్కొంటూ బిల్లులు డ్రా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అన్నిలేఅవుట్‌లో చోటుచేసుకున్న ఇటువంటి అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరారు.

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌బీ కాలనీలోని అబ్దుల్ కలాం పార్కులో మనం గ్రూప్ నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆటగాళ్లంతా ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. మొత్తం 8 జట్లు ఈ పోటీల్లో పాల్గొని పోటీపడ్డారు. కాగా నాని, ఆడారి శివప్రకాష్ జట్టు తమ ప్రత్యర్థి జట్టుపై 21-13 పాయింట్లతో విజయం సాధించింది. శంకర్, నాగిరెడ్డిల జట్టు ద్వితీయ స్థానాన్ని పొందింది. విజేతలకు మనం గ్రూప్ ఎండీ నగేష్, జనసేన నాయకులు పీల వెంకట పరదేశి నాయుడు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జయరాం, రంగారెడ్డి, రఘు, సుధాకర్ పాల్గొన్నారు.

గల్లంతైన విద్యార్థి కోసం సముద్రంలో ముమ్మర గాలింపు

పెదగంట్యాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గంగవరం సముద్రతీరంలో గురువారం సాయంత్రం గల్లంతైన తొమ్మిదో తరగతి విద్యార్థి తనూజ్ (14) ఆచూకీ కోసం శుక్రవారం ఉదయం నుంచి చీకటి పడేవరకు గాలింపు చర్యలు కొనసాగాయి. తూర్పు నావికాదళం హెలికాప్టర్, న్యూపోర్టు పోలీసులు ఏర్పాటు చేసిన డ్రోన్ సాయంతో గాలించారు. ఇండియన్ కోస్ట్ గార్డ్ రెస్క్యూ టీమ్, నలుగురు గజ ఈతగాళ్లు సాగరతీరమంతా గాలించారు. యారాడ బీచ్ అప్పికొండ వరకు తీరం వరకు కొనసాగాయి. తీరం వెంబడి న్యూపోర్టు పోలీసులు గాలించారు. యారాడ బీచ్ అప్పికొండ వరకు తీరం వరకు కొనసాగాయి. తీరం వెంబడి న్యూపోర్టు పోలీసులు గాలించారు. మత్స్యకారులను కూడా వాకబు చేశారు. శుక్రవారం రాత్రి వరకు విద్యార్థి ఆచూకీ లభ్యం కాలేదు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో సంపూర్ణ యావత్ భారతదేశ పాదయాత్ర



కూర్మన్నపాలెం చేరుకున్న యాత్ర రథం

ఆటోనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సుభిక్షంగా ఉండాలని, లోక కళ్యాణం కోసం అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సంపూర్ణ యావత్ భారతదేశ పాదయాత్ర 7 సార్లు నిర్వహిసున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పాదయాత్ర 1984లో ప్రారంభించామనీ, నేటికి 6 పర్యాయాలు పూర్తి చేసి, మూడు నెలలు క్రితం ద్వారకా నుంచి 7వ పర్యాయం ప్రారంభించామని, శుక్రవారానికి కూర్మన్నపాలేనికి చేరుకుందన్నారు.

శబరీనగర్‌లో అన్నసమారాధన



అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న కనకరాజు, గ్రామ పెద్దలు

రామ్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 28వ వార్డులోని గంజిపేటలోని శబరినగర్‌లో శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. టీడీపీ వార్డు ఇన్‌చార్జి నక్కా కనకరాజు, శబరీ నగర్ సంఘం అధ్యక్షుడు కార్యదర్శి చిటిబాబు అప్పరావు ఆధ్వర్యంలో నిర్వహించినఈ కార్యక్రమంలో రామ్‌నగర్, బానోజీనగర్ తదితర ప్రాంతాలకు చెందిన సుమా రు రెండు వేల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు సినీ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ మ్యూజికల్ నైట్

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పోర్టు స్టేడియంలో శనివారం రాత్రి ప్రముఖ సినీ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ నేతృత్వంలో బృందం మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను దేవిశ్రీ ప్రసాద్ హోటల్ నోవాటెల్‌లో శుక్రవారం ఆవిష్కరించారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా రవాణా సదుపాయాలు

» అప్పన్న చందనోత్సవం నేపథ్యంలో సేవలపై ఆర్టీసీ విజయనగరం జోన్ ఈడీ బ్రహ్మానందరెడ్డి



సింహాచలం ఆర్టీసీ డిపో అధికారులు, సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న ఈడీ బ్రహ్మానందరెడ్డి

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం నృసింహస్వామి చందనోత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా రవాణా సదుపాయాలను కల్పించాలని ఆర్టీసీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్ బ్రహ్మానందరెడ్డి అధికారులకు ఆదేశించారు. సింహాచలం డిపోను శుక్రవారం ఆయన సందర్శించారు. డిపో నుంచి అన్ని రూట్లలో తిరిగే బస్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 30న జరగబోయే చందనోత్సవానికి రాకపోకలు సాగించే భక్తుల రవాణాకు వినియోగించే అన్ని బస్సులు మంచి కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలని సూచించారు. గోశాల నుంచి సింహాచలం కొండపైకి 35 బస్సులు, అడవివరం నుంచి సింహాచలం కొండపైకి 15 బస్సులు ప్రత్యేక సర్వీసులుగా ఆపరేట్ చేస్తున్నట్టు వెల్లడించారు. ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె.రాజశేఖర్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మోహనరావు, గ్యారేజీ సిబ్బంది, సూపర్‌వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆహ్లాదంగా 'విమ్స్' పరిసరాలు



పూల మొక్కలు, పచ్చని చెట్లతో కళకళలాడుతున్న విమ్స్ ప్రాంగణం

ఆరిలోవ, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి) విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్) ప్రవేశ ద్వారం వద్ద గల మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. మండు వేసవిలోనూ ఈ మొక్కలు పచ్చదనం, రంగురంగుల పూలతో కనిపిస్తుండడంతో విమ్స్‌కు వచ్చేవారంతా ఆహ్లాద వాతావరణాన్ని చూసి పరవశులవుతున్నారు. అటుగా వచ్చే వారికి స్వాగతం పలుకుతున్నట్టుగా పచ్చగా పెరిగిన చెట్లు చక్కని గాలిని అందిస్తున్నాయి. అక్కడి వాతావరణం వేసవిలో హాయిగా ఉందంటూ వచ్చే వారు అంటున్నారు.

జీవీఎంసీ సిబ్బందిపై కాంట్రాక్టర్ దౌర్జన్యం?

» స్టాండింగ్ కమిటీ ఆమోదం లేకుండా ఆశీలు వసూలు చేయవద్దన్న ఉద్యోగి
» ఆగ్రహంతో అతనిపై దాడికి యత్నం
» కాంట్రాక్టర్‌కు వత్తాసు పలికిన మరో ఉద్యోగి
» రామకృష్ణా రైతుబజార్‌లో సంఘటన

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్టాండింగ్ కమిటీ ఆమోదం లేకుండా ఆశీలు వసూలు కూడదని వారించిన రెవెన్యూ ఉద్యోగిపై సదరు కాంట్రాక్టరు దాడికి యత్నించాడు. ఈ సంఘటన శుక్రవారం ఉదయం జీవీఎంసీ జోన్-4 పరిధిలోని రామకృష్ణారైతుబజార్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వన్‌టౌన్ రామకృష్ణారైతుబజార్‌లో దుకాణాల నుంచి ఆశీలు వసూలుకు నిర్వహించిన వేలంలో ఓ వ్యక్తి కాంట్రాక్టు దక్కించుకున్నాడు. స్టాండింగ్ కమిటీ ఆమోదం లభించకపోవడంతో రెవెన్యూ విభాగం సిబ్బందే ఆశీలు వసూలు చేయాలి. కానీ కాంట్రాక్టర్ రుబాబు చేసి ఆశీలు వసూలుచేస్తున్నాడు. దీనిపై కొంతమంది వ్యాపారులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం జోన్-4 రెవెన్యూ అధికారితోపాటు మరో ఉద్యోగి రామకృష్ణారైతుబజార్‌కు వెళ్లారు. ఆశీలు వసూలు చేస్తున్న వారిని వారించారు. సిబ్బంది కాంట్రాక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో అతడు, అతని కుమారుడు అక్కడికి చేరుకుని రెవెన్యూ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నేను ఎవరో తెలిసి ఇబ్బందిపెడతారా అంటూ దుర్భాషలాడారు.

రెవెన్యూ అధికారి సమాధానం ఇస్తుండగా కాంట్రాక్టర్ నెట్టేందుకు యత్నించడంతో భయభ్రాంతులకు గురయ్యారు. ఉన్నతోద్యోగిపై కాంట్రాక్టర్ తిరగబడితే కింది స్థాయి ఉద్యోగి కాంట్రాక్టర్‌కు వత్తాసు పలికారని, రాజకీయ అండదండలున్న వారితో పెట్టుకోవద్దని హెచ్చరించారని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా పోలీసులకు ఫిర్యాదుచేయాలని భావించిన రెవెన్యూ అధికారికి సర్దిచెప్పి తీసుకువెళ్లిపోవడం కొసమెరుపు.

ఎమ్మెల్యే గంటాను కలిసిన దేవిశ్రీప్రసాద్



భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో ముచ్చటిస్తున్న దేవిశ్రీప్రసాద్

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పోర్టు స్టేడియంలో శనివారం రాత్రి జరుగనున్న సంగీత విభావరి కార్యక్రమంలో పాల్గొనేందుకు దేవిశ్రీప్రసాద్ విశాఖ వచ్చారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ సినీ సంగీత కార్యక్రమాలను నగరవాసులు ఎప్పుడూ ఆదరిస్తారని అన్నారు. ఈ సంగీత విభావరి కూడా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ తాను చేపట్టిన నూతన మ్యూజికల్ ప్రాజెక్టుల గురించి గంటాకు వివరించినట్టు చెప్పారు.

పోలీసులకు చిక్కిన గొలుసు చోరీ నిందితులు



వివరాలు వెల్లడిస్తున్న నేర విభాగం ఏసీపీ లక్ష్మణరావు, సీఐ చక్రధరరావు, ఎస్ఐ అప్పలరాజు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల వ్యవధిలో మూడు గొలుసు చోరీలను ద్వారకా జోన్ నేర విభాగం పోలీసులు ఛేదించారు. వీటికి సంబంధించిన వివరాలను ఎంవీపీ నేర విభాగం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ లక్ష్మణరావు, సీఐ చక్రధరరావు, ఎస్ఐ అప్పలరాజు వెల్లడించారు. గొలుసు దొంగతనాల్లో ఓ కేసులో ఇద్దరు నిందితులు మహా క్రిమినల్స్ ఉన్నారు. పోలీసులు చాకచక్యంగా దర్యాప్తు చేసి, ప్రాణాలకు తెగించి నిందితులను పట్టుకున్నారు. ఎస్ఐలు అప్పలరాజు, రాజు, ఏఎస్ఐ కిషోర్‌బాబు, కానిస్టేబుళ్లు హరి ప్రసాద్, జగత్ కిరణ్, సాయి, అప్పలరాజు, అగస్టిన్, రవి, శేఖర్‌లను డీసీపీ లతా మాధురి, ఏడీసీపీ మోహన్‌రావు అభినందించినట్లు ఏసీపీ తెలిపారు.

ఫోన్ పే పట్టించింది..

శివాజీపాలెం సాయిబాబా గుడి సమీపంలో నివాసం ఉంటున్న గుగ్గిలపు శోభారాణి ఈ నెల 10న ఉదయం ఆరున్నర గంటల సమయంలో ఇంటి ముందు వాలికి ఊడుస్తుండగా, ద్విచక్ర వాహనంపై వచ్చిన దుండగులు ముందు చిరునామా, అనంతరం మంచినీళ్లు అడిగారు. అదను చూసి ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. ద్వారకా ఎస్ఐ రాజు బృందం దీనిపై చురుగ్గా దర్యాప్తు చేపట్టింది. సీసీ ఫుటేజీలను సేకరించి, వారు వినియోగించిన ద్విచక్రవాహనాన్ని ఓ చోట స్వాధీనం చేసుకుంది. నగరంలోని ఓ లాడ్జిలో ఎలాంటి పత్రాలు లేకుండా దిగినట్టు తెలుసుకున్నారు. సదరు లాడ్జిలో ఫోన్ పే ద్వారా గదికి అద్దె చెల్లించడంతో దీని ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు. నేరానికి పాల్పడిన ఇద్దరు నిందితులు విజయవాడ ప్రాంతీయులుగా నిర్ధారించుకుని బృందం అక్కడకు చేరుకొంది. విచారణలో వారు మహా క్రిమినల్స్‌గా తేలింది. విశాఖలో అయిదు చోరీల్లో వీరు నిందితులు. విజయవాడ కుమ్మరిపాలెం ప్రాంతానికి చెందిన షేక్ ఇమ్రాన్(27) అలియాస్ 220 ఇమ్రాన్ అలియాస్ షాను 25 కేసుల్లో నిందితుడు. పదహారు ఎన్‌బీ వారెంట్లు ఉన్నాయి. పోలీసులను తప్పించుకుని తిరుగుతున్న ఇమ్రాన్‌పై హత్యాయత్నం, దోపిడీ, చోరీలు వంటి అనేక కేసులు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి ముత్యాలచెరువు గీతా మందిర్ రోడ్డులో ఉంటున్న నామాల నాగరాజు(33)పై 35కి పైగా కేసులు ఉన్నాయి. వీరిని అరెస్టు చేసే ప్రయత్నంలో పోలీసులు చాలా ఇబ్బందులు పడ్డారు. నిందితులు కత్తులతో పోలీసులపై దాడికి ప్రయత్నించినా ప్రాణాలకు తెగించి వీరిని పట్టుకుని జైలుకు పంపారు. వీరి వద్ద నుంచి ఎనిమిది తులాల బంగారం, రూ.30 వేల నగదు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

మద్దిలపాలెం చైతన్యనగర్‌లో ఉంటున్న పెరియాల హేమలత(75) వద్దకు ఇల్లు అద్దెకు కావాలని ఈ నెల 15న వచ్చిన వ్యక్తి, ఆమె మెడలోని బంగారు గొలుసు, చేతి గాజులు లాక్కొని పారిపోయాడు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి కేఆర్ఎం కాలనీలో నివాసం ఉంటున్న విజయనగరం జిల్లాకు చెందిన సిరిపురపు వెంకటరమణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. దోచిన బంగారం ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలో తాకట్టు పెట్టి, రూ.2,80,500 రుణం తీసుకున్నట్లు నిందితుడు అంగీకరించాడు. ఇతడి వద్ద నుంచి రూ.10 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఎలక్ట్రీషియన్‌గా చేస్తుంటాడని సమాచారం.

ఎంవీపీ కాలనీ ఎనిమిదో సెక్టరులో ఉంటున్న సేవన లలిత(90) అనే వృద్ధురాలి మెడలోని రెండు తులాల బంగారు గొలుసును ఈ నెల 15న ఓ వ్యక్తి లాక్కొని పారిపోయాడు. ఈ సంఘటనలో చురుగ్గా దర్యాప్తు చేసిన పోలీసులు రైల్వే న్యూకాలనీకి చెందిన పిడుగు జగదీష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు చోరీ సొత్తును ఫెడరల్ బ్యాంకులో రూ.1.29 లక్షలకు తాకట్టు పెట్టాడు.

లేజర్ రీ ప్రాక్టీస్ సర్జరీతో కళ్లద్దాలకు చెక్

» ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్యురాలు డాక్టర్ మరియా బషీర్

ఆరిలోవ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : లేజర్ రీ ప్రాక్టీస్ సర్జరీలు కళ్లద్దాలపై ఆధార పడడాన్ని తగ్గించి మెరుగైన కంటి చూపును అందిస్తుందని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్యురాలు డాక్టర్ మరియా బషీర్ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. లేజర్ సోర్స్‌ను ఉపయోగించి కళ్ళలోని కార్నియా ఒంపును సరిదిద్దడం లేజర్ రీ ప్రాక్టీస్ సర్జరీ ద్వారా సాధ్యమన్నారు. అయితే రోగి వయస్సు 21 సంవత్సరాలు నిండి ఉండాలని, కనీసం ఒక సంవత్సరం పాటు స్థిరమైన దృష్టి కలిగి ఉండాలన్నారు. ఆవర్తన దోషం అతి తక్కువగాను మితంగాను ఉండాలని, రోగి కళ్లు మంచి మందంగల కార్నియాలు కలిగి ఉంటేనే ఈ సర్జరీకి అవకాశం ఉంటుందన్నారు. నీటికాసులు కెరాటోకోనెస్ కంటి శుక్లాలు లాంటి ఇతర కంటి వ్యాధులు లేకపోతే లేజర్ రీ ప్రాక్టీస్ సర్జరీ ద్వారా కళ్లద్దాలు లేకుండా డ్రైవింగ్ చేయగలిలినంత స్పష్టంగా చూడగలిగే దృషి లభిస్తుందని ఆమె తెలిపారు. కళ్లద్దాలపై ఆధారపడకుండా చేయడం, కంటిచూపును త్వరితగతిన పొందడం వంటి ప్రయోజనాలు ఈ సర్జరీ ద్వారా పొందవచ్చన్నారు.

కెమికల్ కళాశాల ఓఎస్డీగా సాయిలక్ష్మి

కంచరపాలెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ కళాశాల ఓఎస్డీ (ఆఫీస్ సూపరింటెండెంట్)గా కిల్లి సాయిలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఇక్కడే విధులు నిర్వహించారు. పదోన్నతి పొంది మళ్లీ ఇదే కళాశాలకు వచ్చిన ఆమెను ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, అధ్యాపకులు, సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కనక మహాలక్ష్మి దేవస్థానం ఏఈఓగా రాజేంద్ర కుమార్

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఏఈఓ)గా పనిచేస్తున్న కె.రాజేంద్రకుమార్‌ను వన్‌టౌన్‌లోని కనక మహాలక్ష్మి దేవస్థానం ఏఈఓగా బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రైల్వేస్టేషన్‌లో జీఎం తనిఖీలు

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శుక్రవారం విశాఖ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. ప్లాట్‌ఫామ్‌లపై ప్రయాణికులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఫుట్ ఓవర్‌బ్రిడ్జిలు, లిఫ్టులు, ఎస్కలేటర్ల సౌకర్యాలపై స్థానిక సిబ్బందితో మాట్లాడి పలు అంశాలపై ఆరా తీశారు. అనంతరం స్టేషన్ భవనం అభివృద్ధి పనులు, సర్క్యులేటింగ్ ప్రాంతంలో చేపట్టిన వివిధ ప్రాజెక్టు పనులపై గతిశక్తి అధికారులతో చర్చించారు. రూట్ రిలే క్యాబిన్ (ఆర్ఆర్ఐ) తనిఖీలు చేసి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై చర్చించారు.

మే 14 నుంచి ఎర్నిమాంబ ఆలయ వార్షికోత్సవం

జ్ఞానాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు మే 14 నుంచి 18 వరకూ నిర్వహించనున్నట్లు ఈవో డీవీఎస్ సురేష్ బాబా తెలిపారు. గతంలో రెండు రోజులు జరిగిన ఉత్సవాలు, భక్తుల సౌకర్యార్థం ఈ ఏడాది నుంచి అయిదు రోజులకు పొడిగించినట్లు చెప్పారు. మే 14న రాటోత్సవం, చాటింపు, 15, 16 తేదీల్లో సాంస్కృతికోత్సవాలు, 17న తొలేళ్ళు, 18న వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఉత్సవాల నిర్వహణకు అవసరమైన సామగ్రి కోసం టెండర్లు పిలిచామని చెప్పారు.

బీజేఎంసీ అధ్యక్షుడిగా శివగణేష్

జ్ఞానాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా మజ్దూర్ సెల్ (బీజేఎంసీ) జిల్లా అధ్యక్షుడిగా కండేల శివగణేష్ నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన సమావేశంలో శివ గణేష్‌ను నియమిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు షేక్ ఖలిఫతుల్లా బాషా అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా శివ గణేష్ మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న జీవనోపాధి తదితర సమస్యలు, శ్రమ హక్కులపై స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో కండిపిల్లి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



శివగణేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

ఫుట్‌బాల్ టోర్నీ విజేత.. ఆపరేటింగ్ విభాగం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తూర్పు కోస్తారైల్వే వాల్తేరు డివిజన్ స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహించిన డివిజన్ అంతర్గత ఫుట్‌బాల్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ ఆపరేటింగ్ శాఖ వరుసగా రెండోసారి విజేతగా నిలిచింది. ఆర్పీఎఫ్ రన్నరస్ స్థానాన్ని దక్కించుకుంది. ఫైనల్స్‌లో ఆపరేటింగ్ 2-1 గోల్స్ తేడాతో ఆర్పీఎఫ్‌పై విజయం సాధించింది. రసవత్తరంగా సాగిన ఈ మ్యాచ్ తొలి భాగంలో ఆర్పీఎఫ్ ఒక గోల్ చేసి ఆధిక్యత సాధించగా, ఆపరేటింగ్ స్ట్రయికర్ రవికుమార్ అద్భుతమైన గోల్‌తో స్కోరు సమం చేశారు. రెండో భాగంలో ఆపరేటింగ్ ఆటగాళ్లు ఆధిపత్యం ప్రదర్శించి వరుసగా దాడులు చేశారు. ఈ దశలో రవికుమార్ మరో గోల్ చేసి జట్టుకు విజయాన్నందించాడు. ఫైనల్లో తలపడిన ఇరుజట్ల ఆటగాళ్లను రైల్వే స్పోర్ట్సు ప్రధాన కార్యదర్శి ఎన్.ఉష అభినందించగా, రైల్వే ఫుట్‌బాల్ ప్రతినిధులు శ్రీనివాస్, గణేష్, తిరుమలరావు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత.. నిందితుల అరెస్టు

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని వారి నుంచి భారీగా గంజాయి సంచులను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. శుక్రవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీ చేస్తున్న సమయంలో ఒడిశాలోని కొరాపుట్‌కు చెందిన అజిత్ బురిడి అనే వ్యక్తిని పట్టుకుని అతని నుంచి రూ.35 వేలు విలువైన ఏడు కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గురువారం ఒడిశాకు చెందిన అశ్విని ప్రధాన్ అనే వ్యక్తి కోల్‌కతాకు గంజాయి రవాణా చేస్తుండగా పట్టుకుని రూ.20 వేల విలువైన నాలుగు కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గురువారం ఉదయం బెంగళూరుకు చెందిన ప్రవీణ్‌కుమార్, శశాంక్ అనే ఇద్దరిని పట్టుకుని రూ.15 వేలు విలువైన మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని రైల్వే పోలీసులు తెలిపారు.

సంస్థాగత ఎన్నికలకు సహకరించండి: ఎంపీ శ్రీభరత్

మహారాణిపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి నుంచే పార్టీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు కార్యకర్తలు కృషిచేయాలని, ప్రతీ వార్డులో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక జరిగేలా దోహదపడాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ సూచించారు. టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులలో సమావేశాలు నిర్వహించి అందరి అభిప్రాయాల మేరకు కమిటీని ఎన్నుకోవాలని, ఏకాభిప్రాయంతో సాధ్యం కాకపోతే జిల్లా అధ్యక్షుడి దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమర శెట్టి శ్రీనివాసరావు, దువ్వారపు రామారావు, భరత్, హనోక్, పైలా ముత్యాలనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పద్మలతకు గుర్తింపు కార్డు అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ , ఇతర నాయకులు

పద్మలతకు సభ్యత్వ నమోదు బాధ్యత

24వ వార్డు టీడీపీ అధ్యక్షురాలు బర్ల పద్మలత సభ్యత్వ నమోదు, తదితర అంశాలలో ప్రతిభ కనబరిచారు. సభ్యత్వ నమోదులో ఎలాంటి సమస్యనైనా ఆమె పరిష్కరించగలగడంతో ఎంపీ శ్రీభరత్ జిల్లాలో సభ్యత్వ నమోదు ప్రక్రియ, సమస్యల పరిష్కార బాధ్యతను తీసుకోవాలని పద్మలతకు సూచించారు.

పెళ్లి పేరుతో మోసగించి హత్యకు యత్నిస్తున్నాడని ఫిర్యాదు

సీతంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తనను ప్రేమ పేరుతో నమ్మించి లోబరచుకోవడమేగాక నగ్న వీడియోలు, చిత్రాలు తీసి బ్లాక్‌మెయిల్ చేస్తూ చంపడానికి యత్నిస్తున్నాడని ఓ వ్యక్తిపై నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో యువతి ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఓ యువతి తల్లి బరువు అధికంగా ఉండటంతో హెర్బల్ పౌడర్ వాడే క్రమంలో శ్రీకాకుళం సమీపంలోని పెదపాడుకి చెందిన ఓ యువకుడి కుటుంబంతో పరిచయమైంది. అతడు కొద్దికాలం క్రితం అక్కయ్యపాలెం వచ్చి జిమ్ చేస్తూ, హెర్బల్ పౌడర్లు అమ్మేవాడు. అతడి తండ్రి వారి సామాజికవర్గీయులకు వివాహ సంబంధాలు చూస్తుంటాడు. ఈ క్రమంలో నిందితుడు బాధిత యువతితో స్నేహం పెంచుకుని ప్రేమ పేరుతో నమ్మించాడు. అతని కుటుంబికులూ ఆమెకు బాగా పరిచయమయ్యారు. వారు కూడా యువతితో ప్రేమ, పెళ్లి అంటూ ఆమె వద్ద డబ్బు తీసుకున్నారు. యువతిని గర్భవతిని చేశాక అబార్షన్ చేయించాడు. ఆమె నగ్న వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెడతానని బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. తనను దారుణంగా కొట్టి, దుర్భాషలాడారని పోలీసులకు తెలిపింది. తనను చంపడానికి రూ.20 వేలు సుపారి ఇచ్చాడని ఆరోపించింది. అతడి వద్ద మరో 30 మంది యువతుల నగ్న వీడియోలు ఉన్నాయని పోలీసులకు తెలిపింది. తనకు న్యాయం చేయాలని, ఇంకెవరూ మోసపోకుండా చర్యలు తీసుకోవాలని కోరింది. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

విమానాశ్రయంపై నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

ఎక్కడికైనా సరే విశాఖపట్నం మీదుగానే వెళ్లాలి. ఇక్కడి విమానాశ్రయంలోనే విమానం ఎక్కాలి. ఓ అరగంట సమయం కేటాయించి ఇక్కడి సమస్యలపై దృష్టిసారించాలని నగర వాసులు కోరుకుంటున్నారు. రద్దయిన విమానాలు వెంటనే పునరుద్ధరణ జరిగేలా, కొత్త సర్వీస్‌లు వచ్చేలా చేయాల్సిన ఆవశ్యకత చాలా ఉంది.

గతంలో విశాఖ నుంచి దుబాయ్‌కు అంతర్జాతీయ విమాన సర్వీస్ ఉండేది. వాస్తవానికి ఇక్కడి నుంచి ప్రారంభమైన తొలి విదేశీ విమానం అదే. ఇండియన్ ఎయిర్‌లైన్స్ నడిపింది. కరోనా సమయంలో రద్దయిన ఆ విమానం మళ్లీ పునరుద్ధరణ జరగలేదు. విశాఖ కంటే అనేక విధాలుగా తరువాత స్థానంలో విజయవాడకు మాత్రం దుబాయ్ విమానం నడుస్తోంది. కేంద్ర మంత్రి తక్షణమే విశాఖలో ఓ సమావేశం ఏర్పాటుచేసి, విమాన సర్వీస్‌లతో పాటు కార్గో సేవలు కూడా ప్రారంభమయ్యేలా చూడాల్సి ఉంది. ఉడాన్ యాత్రీ క్యాంటీన్ రుచులను ఇక్కడి ప్రయాణికులకు పరిచయం చేసే బాధ్యత తీసుకోవాలి.

టీసీఎస్ ఆగమనం ఐటీ అభివృద్ధికి సంకేతం

... 5వ పేజీ తరువాయి

భవిష్యత్తులో మరిన్ని కంపెనీలు రానున్నాయన్నారు. రుషికొండలో ఇన్ఫోసిస్ కార్యకలాపాలు విస్తరిస్తోందని పేర్కొన్నారు. రుషికొండ ఐటీ పార్కులో మౌలిక సదుపాయాల కల్పనలో గత వైసీపీ ప్రభుత్వం విఫలమైందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వీధి లైట్లు ఏర్పాటుచేయడం, బస్ సౌకర్యం కల్పించడం వంటివి చేశామన్నారు. ఐటీ కంపెనీలకు పెండింగ్‌లో పెట్టిన ఇన్సెంటివ్‌లను దశల వారీగా విడుదల చేస్తున్నామని వెల్లడించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వైసీపీ దొంగ ఏడ్పులు ఏడుస్తోందని శ్రీభరత్ విమర్శించారు. గత ఐదేళ్లలో ఉత్తరాంధ్రను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన విషయం మరిచిపోయి, ఇప్పుడు అబద్ధపు ప్రచారానికి పాల్పడుతుందని దుయ్యబట్టారు. రెండు దశాబ్దాల క్రితం విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించిన హెచ్ఎస్‌బీసీ నగరం నుంచి తరలిపోతున్నా కనీసం వారిని పిలిచి మాట్లాడలేదన్నారు. టీసీఎస్‌కు కారుచౌకగా భూమి ఇచ్చారని గోబెల్స్ ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకులు, ఒక వ్యక్తి కోసం రూ.450 కోట్లతో రుషికొండపై ప్యాలెస్ ఎందుకు కట్టారో చెప్పాలన్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దృష్టిసారించిందని శ్రీభరత్ పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తయ్యేనాటికి విశాఖ నుంచి కనెక్టవిటీ పెంపునకు వీఎంఆర్‌డీఏ రూ.400 కోట్లతో 17 మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మించనున్నదన్నారు. విశాఖ నుంచి విమానాల రద్దుపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో మాట్లాడామని, రైల్వే జోన్ కార్యకలాపాలు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. లులు కంపెనీ రూ.1800 కోట్ల పెట్టుబడులు పెడుతుందని, దీని వల్ల విశాఖలో టూరిజం విస్తరిస్తుందన్నారు. లులూ కంపెనీ విశాఖతో పాటు విజయవాడ, రాజమండ్రి, తిరుపతిలో మాల్స్ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో అభివృద్ధి చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి కారణమైన వారికి మాట్లాడే హక్కులేదన్నారు. గడచిన పది నెలల్లో విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ.11,404 కోట్లు సాయం అందించామన్నారు. వైసీపీ నాయకులు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని అప్పలనాయుడు అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి నారా లోకేశ్‌లు ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దృష్టిసారించారన్నారు. విలేకరుల సమావేశంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, పాల్గొన్నారు.

మూతపడిన ఫిట్జీ

... 5వ పేజీ తరువాయి

బ్రాంచీలను తెరిచింది. ఒక్కో విద్యార్థి నుంచి ఏడాదికి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఫీజుగా వసూలు చేసింది. ఎంవీపీ బ్రాంచిలో గత విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో సుమారు 220 మంది చేరారు. విద్యా సంవత్సరం సగం కూడా గడవకముందే రెండో ఏడాది ఫీజునూ వసూలు చేశారు. ఇదిలావుండగా అక్టోబరు నుంచే గడ్డుకాలం ప్రారంభమయింది. యాజమాన్యం జీతాలు ఇవ్వడం లేదంటూ అధ్యాపకులు ఒక్కొక్కరుగా కళాశాలను విడిచిపెట్టి వెళ్లిపోయారు. పరీక్షల ముందు ఈ పరిస్థితి తలెత్తడంతో కొంతమంది తమ పిల్లలను ఇతర కళాశాలల్లో చేర్పించారు. మిగిలినవారు అక్కడే పరీక్షలు రాశారు. వచ్చే విద్యా సంవత్సరంలో కూడా క్లాసులు నడిచే పరిస్థితి లేకపోవడంతో తాము చెల్లించిన ఫీజు వాపసు చేయాలని తల్లిదండ్రులు కళాశాల చుట్టూ తిరుగుతున్నారు. ఆ లేఖలు ఢిల్లీలో ఉన్న యాజమాన్యానికి పంపించడం మినహా తాము ఏమీ చేయలేమని సిబ్బంది చెబుతున్నారు. విద్యార్థుల జీవితంతో ఆడుకున్న ఫిట్జీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం కళాశాల ఎదుట నిరసన తెలిపిన అనంతరం ఎంవీపీ పోలీసులను ఆశ్రయించారు. ప్రస్తుతం కళాశాలలో ముగ్గురు కింది స్థాయి సిబ్బంది మాత్రమే ఉన్నారు. శాంతిపురం బ్రాంచి వద్ద కూడా బోర్డు కూడా తొలగించారు.

చర్యలు తీసుకుంటాం

కళాశాల మూసివేయాల్సిన పరిస్థితి వస్తే, విద్యార్థులకు ప్రత్యామ్నాయం చూపించాలి. తల్లిదండ్రులు ఒకేసారి రెండు సంవత్సరాల ఫీజు చెల్లించకూడదు. అర్ధంతరంగా మూసివేసిన ఫిట్జీ జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం.
- పి.మురళీధర్, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి, ఇంటర్ బోర్డు

మహా ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

టీడీపీ నుంచి గెలిచిన ఒకరు వైసీపీలో చేరిపోయారు. ఆ తర్వాత జరిగిన 32వ వార్డు ఉప ఎన్నికల్లో టీడీపీ స్థానాన్ని వైసీపీ దక్కించుకోవడంతో కౌన్సిల్‌లో ఆ పార్టీకి ఎదురులేకుండాపోయింది. అయితే 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో కౌన్సిల్‌లో సమీకరణాలు తలకిందులైపోయాయి. వైసీపీ నుంచి గెలిచిన 19 మంది కార్పొరేటర్లు టీడీపీలో, మరో తొమ్మిది మంది జనసేనలో చేరిపోయారు. ఇండిపెండెంట్‌లుగా గెలిచిన నలుగురిలో ఇద్దరు టీడీపీ, మరో ఇద్దరు జనసేనలో చేరిపోయారు. ఈ నేపథ్యంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై అవిశ్వాసం ప్రకటిస్తూ కూటమి కార్పొరేటర్లు 58 మంది సంతకాలు చేసి గత నెల 21న జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌కు నోటీస్ ఇచ్చారు. అందులో సంతకాల ధ్రువీకరణ అనంతరం అవిశ్వాస తీర్మానంపై శనివారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు.

తీర్మానం నెగ్గాలంటే 74 మంది సభ్యుల మద్దతు అవసరం

మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై శనివారం ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే కూటమికి 74 మంది సభ్యుల మద్దతు అవసరం. జీవీఎంసీలో 97 మంది కార్పొరేటర్లతోపాటు 14 మంది ఎక్స్‌అఫిషియో సభ్యులు కలుపుకుని 111 మంది ఓటుహక్కు కలిగిన సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం టీడీపీకి 48, జనసేనకు 14, బీజేపీకి ఇద్దరు కార్పొరేటర్లు మొత్తం కూటమికి 64 మంది కార్పొరేటర్ల బలం ఉంది. వైసీపీకి 30 మంది, సీపీఐ, సీపీఎంకి ఒక్కొక్కరు ఉన్నారు. ఇటీవలే వైసీపీకి రాజీనామా చేసిన ఆరో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక (మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుమార్తె) తన వైఖరిని ఇంకా ప్రకటించలేదు. సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానంపై జరిగే సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. వైసీపీ కూడా సమావేశాన్ని బహిష్కరించాలని నిర్ణయించింది. కూటమి చేతిలో ఉన్న 64 మంది కార్పొరేటర్లతోపాటు 11 మంది ఎక్స్‌అఫిషియో సభ్యులు సమావేశానికి హాజరైతే అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు అవకాశం ఉంటుంది. వీరితోపాటు ముత్తంశెట్టి ప్రియాంక కూడా హాజరయ్యే అవకాశం ఉందంటున్నారు.

వైరివర్గాల్లోని సభ్యుల కోసం కొనసాగుతున్న నేతల వేట

అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు కూటమికి 74 మంది సభ్యుల మద్దతు తప్పనిసరి. అయితే ఆ సంఖ్యను చేరకుండా వైసీపీ నేతలు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అందుకోసం కొద్దిరోజుల కిందట వరకు తమ పార్టీలో ఉండి ప్రస్తుతం కూటమిలో చేరిన కార్పొరేటర్లను తిరిగి తమ వైపు లాక్కోవాలని చూస్తున్నారు. తెలుగుదేశం కార్పొరేటర్లంతా శుక్రవారం రాత్రివరకూ మలేషియాలో ఉండడంతో నగరంలో ఉన్న వారి కుటుంబసభ్యుల ద్వారా సంప్రతింపులు జరిపినట్టు తెలిసింది. ఒకరిద్దరు కార్పొరేటర్లను భారీ నజరానా ఆశ చూపించి కౌన్సిల్ సమావేశానికి హాజరుకాకుండా నిరోధించడం లేదంటే కౌన్సిల్‌కు హాజరైనా సరే అవిశ్వాసానికి మద్దతుగా చెయ్యి ఎత్తకుండా ఉండిపోయేలా ఒప్పందం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతుండడం కూటమి నేతలను ఆందోళనకు గురిచేస్తోంది. గాజువాక ప్రాంతానికి చెందిన ఒక కార్పొరేటర్ మలేషియా విమానాశ్రయం నుంచి తప్పించుకుని వెళ్లిపోయారని ప్రచారం జరుగడంతో కూటమి నేతలు అప్రమత్తమై ప్రతి కార్పొరేటర్ వెనుక ప్రత్యేకంగా మనుషులను కాపలా పెట్టుకున్నారు. మరోవైపు కూటమి నేతలు కూడా తమలో కొందరు దెబ్బకొట్టినా సరే అవిశ్వాస తీర్మానం నెగ్గేలా ముందుజాగ్రత్తగా వైసీపీలోని ఇద్దరు, ముగ్గురు సభ్యులను తమ వైపు తిప్పుకునేందుకు యత్నిస్తున్నారు. అందుకోసం కేరళ, శ్రీలంకలో ఉన్న వైసీపీ కార్పొరేటర్ల వద్దకు మనుషులను పంపినట్టు సమాచారం. వీలైతే రాత్రికే వారిని అక్కడి నుంచి నగరానికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇరువర్గాలు ఎత్తుకుపైఎత్తులు వేస్తుండడంతో ఫలితంపై ఉత్కంఠ నెలకొంది.

కేజీహెచ్‌లో ఇన్‌చార్జి మంత్రి తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

వెల్లడించారు. మూడు నెలల్లో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. వైద్యులు, సిబ్బంది రోగులకు సంతృప్తికరమైన సేవలు అందించాలని ఆదేశించారు. సెక్యూరిటీ, పారిశుధ్య సేవలను మరింత మెరుగుపరచాలని, యూజీడీ వ్యవస్థలో లోపాలను సరిచేయాలని సూచించారు. దశల వారీగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని మంత్రి తెలిపారు. ఫార్మసీ కౌంటర్లు పెంచాలని, టోకెన్ డిస్‌ప్లే వ్యవస్థను అమలు చేయాలని సూచించారు. కేజీహెచ్‌లో అదనపు పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. కేవలం కేజీహెచ్‌పైనే భారం పడకుండా అనుబంధ ఆసుపత్రుల్లో మెడికో లీగల్ కేసుల పరీక్షలు నిర్వహించాలని మంత్రి సూచించారు. జనన ధ్రువీకరణ, శిశు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఏఎంసీ విద్యార్థుల కోసం గ్యాలరీలు ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి డోలా తెలిపారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. దక్షిణ నియోజకవర్గ శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవి లత, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి, ఆర్ఎంవో డాక్టర్ మెహర్ కుమార్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెట్‌వర్క్ ఆస్పత్రులు క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ చేయాల్సిందే..

... 5వ పేజీ తరువాయి

ఉన్నారు. వారితోపాటు ఉద్యోగుల హెల్త్ స్కీమ్ పథకంలో భాగంగా రెండు లక్షల కుటుంబాలకు, జర్నలిస్టు హెల్త్ స్కీమ్ కింద మరో వేయి మంది కుటుంబాలకు అందించే వైద్య సేవలను పర్యవేక్షిస్తున్నాం. వీరికి ఏ ఇబ్బందులు ఉన్నా మాకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

ప్ర: ఆయుష్మాన్ భారత్ పథకం లబ్ధిదారులు ఎంతమంది?

జ: కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఉచితంగా నిరుపేదలకు వైద్య సేవలు అందించేందుకు హెల్త్ కార్డులు అందిస్తోంది. ఈ పథకానికి జిల్లాలో 9,11,697 మంది అర్హులుగా గుర్తించింది. వీరిలో ఇప్పటివరకూ 6,95,049 మందికి ఈకేవైసీ పూర్తి చేశాం. కార్డులు పంపిణీ ప్రక్రియను కూడా త్వరలోనే పూర్తిచేస్తాం. ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్‌లో ఉన్న ఆస్పత్రులన్నింటిలోనూ దాదాపు ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఉచిత వైద్య సేవలు అందుతాయి. ఈ పథకంలో భాగంగా ఐదు లక్షల వరకూ ఉచిత ఆరోగ్య బీమా లభిస్తుంది. 70 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఈ కార్డులను అందిస్తున్నాం.

ప్ర: సమస్యలుంటే ఎవరిని సంప్రతించాలి?

జ: ఆస్పత్రిలో చేరిన దగ్గర నుంచి డిశ్చార్జ్ అయ్యేంత వరకు ఎటువంటి సమస్య ఉన్నా ఫిర్యాదు చేయవచ్చు. ఆరోగ్య మిత్రలు ప్రతిరోజూ బెడ్‌సైట్ విజిట్ చేయాలి. క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ చేయించే బాధ్యత ఆరోగ్య మిత్రలపై ఉంటుంది. నేను కూడా టీమ్‌తో ప్రతిరోజూ కనీసం మూడు నుంచి ఐదు ఆస్పత్రులు విజిట్ చేస్తుంటా. రోగులతో స్వయంగా మాట్లాడి ఇబ్బందులు తెలుసుకుంటాం. కొన్నిసార్లు డిశ్చార్జ్ అయి వెళ్లిన రోగులతో ఫోన్‌లో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందాయన్న విషయాన్ని కూడా తెలుసుకుంటాం.

వాహనాల చోరీ కేసులో ఇద్దరు ఒడిశావాసుల అరెస్టు



నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

మహారాణిపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలు దొంగిలించిన అంతర్రాష్ట్ర ముఠాను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అల్లిపురానికి చెందిన షేక్ రంజాన్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం రాత్రి ఇంటి ముందు పార్కు చేయగా తెల్లారేసరికి అదృశ్యమైంది. దీనితో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో అనుమానితులైన ఒడిశాలోని కొరాపుట్ ప్రాంతానికి చెందిన కార్తిక్ కిల్లో, బబ్లూ సుపియాలను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా మరో ఎనిమిది ద్విచక్రవాహనాలను సైతం దొంగిలించినట్లు తేలింది. వారి వద్ద నుంచి మొత్తం తొమ్మిది వాహనాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని ఆత్మహత్య

సీతంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఇంటిలో ఫ్యానుకు తువ్వాలతో ఉరేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతంపేట రెల్లివీధికి చెందిన దేవులపల్లి రవి (40) తన భార్య పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. కూలి పనులు చేసేవాడు. మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం మద్యం తాగడానికి డబ్బులు అడిగి ఇంటిలో గొడవ పడ్డాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో కోపంతో బెదిరించి ఇంటి లోపలకు వెళ్లిపోయాడు. ఫ్యానుకు తువ్వాలు చుట్టి ఉరేసుకున్నాడు. లోపలకు వెళ్లిన మృతుడి భార్య, ఇరుగుపొరుగు వారు కిందికి దించారు. అయితే అప్పటికే రవి మృతి చెందాడు. ద్వారకా పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సీఐ డీవీ రమణ ఆధ్వర్యంలో ఏఎస్ఐ సీతామహాలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రత్యేక హోదా కోసం కృషిచేయాలి ; కాంగ్రెస్

మురళీనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి); ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన కోసం ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు కృషి చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు కోరారు. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని 16వ ఆర్థిక సంఘం చైర్మన్ వ్యాఖ్యపై విచారం వ్యక్తంచేస్తూ శుక్రవారం ఆయన స్పందించారు. ప్రధాని మోదీ వాగ్దానం మేరకు ఏపీ ప్రజలు పదేళ్లుగా ప్రత్యేక హోదా ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు.

పెళ్లి పేరుతో మోసగించాడంటూ గర్భిణి ఫిర్యాదు

సీతంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి తాను గర్భం దాల్చాక ముఖం చాటేశాడంటూ నాలుగో పట్టణ పోలీసులకు ఓ మహిళ ఫిర్యాదు చేసింది. వారు తెలిపిన వివరాల ప్రకారం... దొండపర్తికి చెందిన బేరడం ఉమామహేశ్వరికి కొన్నేళ్ల క్రితం వివాహమైంది. దంపతుల మధ్య గొడవలు జరిగి పెద్దల సమక్షంలో విడిపోయారు. దీంతో ఆమె ఒక్కతే ఉంటూ జిల్లా పరిషత్ ప్రాంతంలోని ఓ డయాగ్నో సెంటర్‌లో పని చేస్తోంది. ఈ క్రమంలో దొండపర్తికి చెందిన వరుసకు మామయ్య అయిన రవికుమార్ ఆమెతో స్నేహంగా ఉంటూ మాయ మాటలు చెప్పి శారీరకంగా లోబర్చుకున్నాడు. దీంతో ఆమె గర్భం దాల్చింది. విషయం తెలుసుకొని రవికుమార్ పెళ్లి చేసుకుంటానని చెప్పి గర్భం తీయించి మళ్లీ శారీరకంగా దగ్గరయ్యాడు. మళ్లీ ఆమె గర్భం దాల్చడంతో పెళ్లికి నిరాకరిస్తూ ముఖం చాటేశాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు కార్లు ఢీ.. త్రుటిలో తప్పిన ప్రమాదం



డీవైడర్లు ఢీకొట్టి దెబ్బతిన్న కార్లు

కంచరపాలెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెం సిగ్నల్ పాయింట్ నుంచి కంచరపాలెం వైపు జాతీయ రహదారిపై వస్తున్న రెండు కార్లు ఢీకొట్టడంతో కార్లు ముందు భాగాలు నుజ్జయ్యాయి. శుక్రవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంతో జాతీయరహదారిపై ట్రాఫిక్ జామ్ అయ్యింది. తాటిచెట్లపాలెం సిగ్నల్ దాటి జాతీయ రహదారి ప్రధాన మార్గంలో వస్తున్న ఒక కారును అదే మార్గంలో సర్వీస్ రోడ్డులో వెళ్తున్న మరో కారు ధర్మానగర్ కటింగ్ పాయింట్ వద్ద ఢీకొట్టింది. రెండు కార్లు డివైడర్లను ఢీకొట్టి ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో రెండు కార్ల ముందు భాగాలు దెబ్బతిన్నాయి. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని కార్లను క్రేన్లతో బయటకు తీసి స్టేషన్‌కు తరలించారు. ఎటువంటి నష్టం జరగకపోవడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

వేడుకగా శ్రీరామ పట్టాభిషేకం



సంజీవనగర్ కాలనీలో నిర్వహించిన సీతారాముల పట్టాభిషేకం

ఆరిలోవ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సంజీవనగర్ కాలనీలో వెలిసిన మహాగణపతి సీతారామలక్ష్మణ అభయాంజనేయ స్వామి సహిత సాయినాథ దేవాలయం అష్టమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం సీతారాముల పట్టాభిషేకం కన్నుల పండవగా నిర్వహించారు. అనంతరం నారాయణ సేవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం నెహ్రూ యుజన సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నారాయణ సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని అనిల్‌కుమార్ రాజు ఆర్థిక సహాయంతో చేపట్టారు.

సీఆర్పీఎఫ్ ఐజీ శ్రీనివాస్‌కు పోలీసు మెడల్ ఫర్ డిస్టింగిస్ట్ అవార్డు



కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేతుల మీదుగాఅవార్డు అందుకుంటున్నశ్రీనివాస్

ఆరిలోవ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : విశాలాక్షి నగర్ కైలాసగిరిలో గల కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) ఐజీ ఆరాధ్యుల శ్రీనివాస్‌కు ఢిల్లీలో సీఆర్పీఎఫ్ 86వ వార్షికోత్సవాల్లో భాగంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా ప్రెసిడెంట్ పోలీసు మెడల్ ఫర్ డిస్టింగిస్ట్ సర్వీస్ అవార్డు అందుకున్నారు. ఆయన 34 ఏళ్లకు పైగా విశిష్ట సేవలను అందించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

విమ్స్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ పనులు

ఆరిలోవ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్) ప్రాంగణంలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులను గత నాలుగు రోజుల నుంచి చేపడుతున్నారు. పాత జాతీయ రహదారి నుంచి విమ్స్‌లో గల విద్యుత్ కార్యాలయం వరకూ ఈ పనులు చేపడుతున్నారు. పాత్‌వేకు ఆనుకొనిఈ పనులు జరుగుతున్నాయి. అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ పనులు పూర్తిగా అయినట్లయితే ఇక విద్యుత్ స్తంభాల అవసరం ఉండదు. దీనివల్ల తరచూ ఎదురయ్యే విద్యుత్ అంతరాయం సమస్య తగ్గుతుందని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

సినిమా గైడ్

- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)
- **జాక్ :** రమాదేవి
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 18, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 26, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 32, బీరకాయలు 40, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 14, క్యారెట్ 30 దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 26, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు

బ్రాయిలర్	
రైతు ధర	104
లైవ్ ధర	124
విత్ స్కిన్	218
స్కిన్‌లెస్	228

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

- ఉదయం నుంచి చర్చిల్లో సందడి
- ప్రత్యేక ప్రార్థనలు
- కీర్తనలు ఆలపిస్తూ ఏసుక్రీస్తు ఆరాధన



వెంకోజీపాలెం : కీర్తనలు ఆలపిస్తున్న సియోను చర్చి ప్రతినిధులు, క్రీస్తు ఆరాధకులు



ఆరిలోవ : ప్రార్థనలు చేస్తున్న క్రీస్తు ఆరాధకులు, శిలువ మోస్తున్న విశ్వాసకులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని జీవీఎంసీ 16వ వార్డు భానునగర్ సీయోను మందిరంలో శుక్రవారం పాస్టర్ వంక శివశంకర్ లాజరస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పాడేరు వెళ్లి అక్కడ గిరిజన ప్రాంతంలో యేసుక్రీస్తు ప్రార్థనలు చేసి, యేసు పాటలను ఆలపిస్తూ, ఏసు గొప్పతనాన్ని తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేసినట్టు తెలిపారు. శిలువతో కూడిన యేసు ప్రతిమను మోస్తూ పాడేరు గిరిజన, కొండవాలు ప్రాంతంలోనూ, మద్దిలపాలెం, చర్చి చుట్టుపక్కలా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి గిరిజన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ వంక శివశంకర్ లాజరస్, ఎ.రాజకుమార్, ఇతర చర్చి సభ్యులు, స్థానిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గుడ్ ఫ్రైడే పురస్కరించుకొని ఆరిలోవ ఆర్‌సీఎం చర్చిలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ జోసెఫ్ అని తొట్టం, ఫాదర్ విజయకుమార్ ఫాదర్ ఎస్ థామస్ పలువురు మత పెద్దలు సభ్యులు విచారణ కన్యస్త్రీలు భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా శిలువ ఆరాధన, శిలువ ముద్దు వంటికార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పెదగదిలి, ఈశ్వరదేవీనగర్‌లోగల నోబుల్ చర్చిల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అధిక సంఖ్యలో ఏసు ఆరాధకులు పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్లకు బిల్లులు

- జియోట్యాగింగ్‌తో మోసాలు
- విజయరాంపురం లే అవుట్‌లో 182 ఇళ్లపై ఫిర్యాదు

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం హయాంలో నగర శివారు ప్రాంతాల్లో సెంటు స్థలంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్కడక్కడా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండానే బిల్లులు చెల్లిస్తున్నారనే వాదన ఉంది. జియోట్యాగింగ్ సాయంతో ఎవరికి అనుమానం రాకుండా చేయని పనులకు బిల్లులు మంజూరుచేస్తున్నారని తాజాగా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. పద్మనాభం మండలం విజయరాంపురం లే అవుట్‌లో 182 ఇళ్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు భిన్నంగా జియోట్యాగింగ్ చేసి కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నగర శివార్లలో 65 లే అవుట్‌లలో లక్షకు పైగా ఇళ్లు నిర్మిస్తున్నారు. అయితే ఇళ్ల నిర్మాణాలకు ముందు నగరంలో ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారులకు తీసుకెళ్లి వారికి కేటాయించిన ప్లాటు ముందు నిలబెట్టి ఫొటోలు తీసి జియో ట్యాగింగ్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. దశల వారీగా లబ్ధిదారులకు ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తరువాత బిల్లులు చెల్లిస్తారు. అయితే నగరంలో 22వ వార్డుకు చెందిన వారికి పద్మనాభం మండలం విజయరాంపురం, మద్ది, ఆనందపురం మండలం గొట్టిపల్లిలో ప్లాట్లు మంజూరు చేశారు. విజయరాంపురంలో కొన్ని ఇళ్లకు సంబంధించి పనులు పూర్తి చేయకుండానే నిర్మాణాలు జరిగినట్టు ఆన్‌లైన్‌లో చూపించారు. ఉదాహరణకు లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్ల వద్ద కాకుండా సమీపంలో దాదాపు నిర్మాణాలు పూర్తియిన ఇళ్ల వద్ద నిల్చోబెట్టి ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారనే విషయం తాజాగా వెలుగులోనికి వచ్చింది. దీనిపై లబ్ధిదారులకు అనుమానం వచ్చి వార్డు కార్యదర్శులు, హౌసింగ్ అధికారులను నిలదీశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

భారీ వ్యత్యాసం

విజయరాంపురంలో కాకుండా మద్ది, గొట్టిపల్లి లే అవుట్‌లలో క్షేత్రస్థాయిలో నిర్మాణాలకు, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన బిల్లులకు మధ్య వ్యత్యాసం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్న 112 ఇళ్ల గోడల వరకు నిర్మాణాలు పూర్తిచేసినట్టు వివరించారు. గొలగాని శైలజ అనే లబ్ధిదారునికి చెందిన ఇళ్లు రూఫ్ కాస్ట్ (స్లాబ్ వేయడం) వరకు పనులు చేపట్టగా ఆన్‌లైన్‌లో మాత్రం మొత్తం ఇంటినిర్మాణం పూర్తియిందని చూపించారు. పల్లా భాగ్యశ్రీ అనే లబ్ధిదారునికి చెందిన ఇళ్లు పునాది కోసం కాలమ్స్ వేసి గ్రావెల్ కప్పి అక్కడ కొన్ని ఇటుకలు ఉండగా నిర్మాణం పూర్తయినట్టు చూపించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మండపాక జ్యోతికు కేటాయించిన ప్లాటులో పునాది వరకు మాత్రమే పనులు జరగ్గా ఆన్‌లైన్‌లో మాత్రం స్లాబ్ పూర్తిచేసినట్టు పేర్కొంటూ బిల్లులు డ్రా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అన్నిలేఅవుట్‌లో చోటుచేసుకున్న ఇటువంటి అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరారు.

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌బీ కాలనీలోని అబ్దుల్ కలాం పార్కులో మనం గ్రూప్ నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆటగాళ్లంతా ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. మొత్తం 8 జట్లు ఈ పోటీల్లో పాల్గొని పోటీపడ్డారు. కాగా నాని, ఆడారి శివప్రకాష్ జట్టు తమ ప్రత్యర్థి జట్టుపై 21-13 పాయింట్లతో విజయం సాధించింది. శంకర్, నాగిరెడ్డిల జట్టు ద్వితీయ స్థానాన్ని పొందింది. విజేతలకు మనం గ్రూప్ ఎండీ నగేష్, జనసేన నాయకులు పీల వెంకట పరదేశి నాయుడు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జయరాం, రంగారెడ్డి, రఘు, సుధాకర్ పాల్గొన్నారు.

గల్లంతైన విద్యార్థి కోసం సముద్రంలో ముమ్మర గాలింపు

పెదగంట్యాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గంగవరం సముద్ర తీరంలో గురువారం సాయంత్రం గల్లంతైన తొమ్మిదో తరగతి విద్యార్థి తనూజ్ (14) ఆచూకీ కోసం శుక్రవారం ఉదయం నుంచి చీకటి పడేవరకు గాలింపు చర్యలు కొనసాగాయి. తూర్పు నావికాదళం హెలికాప్టర్, న్యూపోర్టు పోలీసులు ఏర్పాటు చేసిన డ్రోన్ సాయంతో గాలించారు. ఇండియన్ కోస్ట్ గార్డ్ రెస్క్యూ టీమ్, నలుగురు గజ ఈతగాళ్లు సాగరతీరమంతా గాలించారు. యారాడ బీచ్ అప్పికొండ వరకు తీరం వరకు కొనసాగాయి. తీరం వెంబడి న్యూపోర్టు పోలీసులు గాలించారు. యారాడ బీచ్ అప్పికొండ వరకు తీరం వరకు కొనసాగాయి. తీరం వెంబడి న్యూపోర్టు పోలీసులు గాలించారు. మత్స్యకారులను కూడా వాకబు చేశారు. శుక్రవారం రాత్రి వరకు విద్యార్థి ఆచూకీ లభ్యం కాలేదు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో సంపూర్ణ యావత్ భారతదేశ పాదయాత్ర



కూర్మన్నపాలెం చేరుకున్న యాత్ర రథం

ఆటోనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సుభిక్షంగా ఉండాలని, లోక కళ్యాణం కోసం అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సంపూర్ణ యావత్ భారతదేశ పాదయాత్ర 7 సార్లు నిర్వహిసున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పాదయాత్ర 1984లో ప్రారంభించామనీ, నేటికి 6 పర్యాయాలు పూర్తి చేసి, మూడు నెలలు క్రితం ద్వారకా నుంచి 7వ పర్యాయం ప్రారంభించామని, శుక్రవారానికి కూర్మన్నపాలేనికి చేరుకుందన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా రవాణా సదుపాయాలు

- అప్పన్న చందనోత్సవం నేపథ్యంలో సేవలపై ఆర్టీసీ విజయనగరం జోన్ ఈడీ బ్రహ్మానందరెడ్డి



సింహాచలం ఆర్టీసీ డిపో అధికారులు, సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న ఈడీ బ్రహ్మానందరెడ్డి

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం నృసింహస్వామి చందనోత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా రవాణా సదుపాయాలను కల్పించాలని ఆర్టీసీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్ బ్రహ్మానందరెడ్డి అధికారులకు ఆదేశించారు. సింహాచలం డిపోను శుక్రవారం ఆయన సందర్శించారు. డిపో నుంచి అన్ని రూట్లలో తిరిగే బస్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 30న జరగబోయే చందనోత్సవానికి రాకపోకలు సాగించే భక్తుల రవాణాకు వినియోగించే అన్ని బస్సులు మంచి కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలని సూచించారు. గోశాల నుంచి సింహాచలం కొండపైకి 35 బస్సులు, అడవివరం నుంచి సింహాచలం కొండపైకి 15 బస్సులు ప్రత్యేక సర్వీసులుగా ఆపరేట్ చేస్తున్నట్టు వెల్లడించారు. ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె.రాజశేఖర్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మోహనరావు, గ్యారేజీ సిబ్బంది, సూపర్‌వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

శబరీనగర్‌లో అన్నసమారాధన



అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న కనకరాజు, గ్రామ పెద్దలు

రామ్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 28వ వార్డులోని గంజిపేటలోని శబరినగర్‌లో శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. టీడీపీ వార్డు ఇన్‌చార్జి నక్కా కనకరాజు, శబరీ నగర్ సంఘం అధ్యక్షుడు కార్యదర్శి చిటిబాబు అప్పరావు ఆధ్వర్యంలో నిర్వహించినఈ కార్యక్రమంలో రామ్‌నగర్, బానోజీనగర్ తదితర ప్రాంతాలకు చెందిన సుమా రు రెండు వేల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు సినీ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ మ్యూజికల్ నైట్

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పోర్టు స్టేడియంలో శనివారం రాత్రి ప్రముఖ సినీ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ నేతృత్వంలో బృందం మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను దేవిశ్రీ ప్రసాద్ హోటల్ నోవాటెల్‌లో శుక్రవారం ఆవిష్కరించారు.

ఆహ్లాదంగా 'విమ్స్' పరిసరాలు



పూల మొక్కలు, పచ్చని చెట్లతో కళకళలాడుతున్న విమ్స్ ప్రాంగణం

ఆరిలోవ, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి) విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్) ప్రవేశ ద్వారం వద్ద గల మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. మండు వేసవిలోనూ ఈ మొక్కలు పచ్చదనం, రంగురంగుల పూలతో కనిపిస్తుండడంతో విమ్స్‌కు వచ్చేవారంతా ఆహ్లాద వాతావరణాన్ని చూసి పరవశులవుతున్నారు. అటుగా వచ్చే వారికి స్వాగతం పలుకుతున్నట్టుగా పచ్చగా పెరిగిన చెట్లు చక్కని గాలిని అందిస్తున్నాయి. అక్కడి వాతావరణం వేసవిలో హాయిగా ఉందంటూ వచ్చే వారు అంటున్నారు.

జీవీఎంసీ సిబ్బందిపై కాంట్రాక్టర్ దౌర్జన్యం?

- స్టాండింగ్ కమిటీ ఆమోదం లేకుండా ఆశీలు వసూలు చేయవద్దన్న ఉద్యోగి
- ఆగ్రహంతో అతనిపై దాడికి యత్నం
- కాంట్రాక్టర్‌కు వత్తాసు పలికిన మరో ఉద్యోగి
- రామకృష్ణా రైతుబజార్‌లో సంఘటన

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్టాండింగ్ కమిటీ ఆమోదం లేకుండా ఆశీలు వసూలు కూడదని వారించిన రెవెన్యూ ఉద్యోగిపై సదరు కాంట్రాక్టరు దాడికి యత్నించాడు. ఈ సంఘటన శుక్రవారం ఉదయం జీవీఎంసీ జోన్-4 పరిధిలోని రామకృష్ణారైతుబజార్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వన్‌టౌన్ రామకృష్ణారైతుబజార్‌లో దుకాణాల నుంచి ఆశీలు వసూలుకు నిర్వహించిన వేలంలో ఓ వ్యక్తి కాంట్రాక్టు దక్కించుకున్నాడు. స్టాండింగ్ కమిటీ ఆమోదం లభించకపోవడంతో రెవెన్యూ విభాగం సిబ్బందే ఆశీలు వసూలు చేయాలి. కానీ కాంట్రాక్టర్ రుబాబు చేసి ఆశీలు వసూలుచేస్తున్నాడు. దీనిపై కొంతమంది వ్యాపారులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం జోన్-4 రెవెన్యూ అధికారితోపాటు మరో ఉద్యోగి రామకృష్ణారైతుబజార్‌కు వెళ్లారు. ఆశీలు వసూలు చేస్తున్న వారిని వారించారు. సిబ్బంది కాంట్రాక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో అతడు, అతని కుమారుడు అక్కడికి చేరుకుని రెవెన్యూ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నేను ఎవరో తెలిసి ఇబ్బందిపెడతారా అంటూ దుర్భాషలాడారు.

రెవెన్యూ అధికారి సమాధానం ఇస్తుండగా కాంట్రాక్టర్ నెట్టేందుకు యత్నించడంతో భయభ్రాంతులకు గురయ్యారు. ఉన్నతోద్యోగిపై కాంట్రాక్టర్ తిరగబడితే కింది స్థాయి ఉద్యోగి కాంట్రాక్టర్‌కు వత్తాసు పలికారని, రాజకీయ అండదండలున్న వారితో పెట్టుకోవద్దని హెచ్చరించారని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా పోలీసులకు ఫిర్యాదుచేయాలని భావించిన రెవెన్యూ అధికారికి సర్దిచెప్పి తీసుకువెళ్లిపోవడం కొసమెరుపు.

ఎమ్మెల్యే గంటాను కలిసిన దేవిశ్రీప్రసాద్



భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో ముచ్చటిస్తున్న దేవిశ్రీప్రసాద్

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పోర్టు స్టేడియంలో శనివారం రాత్రి జరుగనున్న సంగీత విభావరి కార్యక్రమంలో పాల్గొనేందుకు దేవిశ్రీప్రసాద్ విశాఖ వచ్చారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ సినీ సంగీత కార్యక్రమాలను నగరవాసులు ఎప్పుడూ ఆదరిస్తారని అన్నారు. ఈ సంగీత విభావరి కూడా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ తాను చేపట్టిన నూతన మ్యూజికల్ ప్రాజెక్టుల గురించి గంటాకు వివరించినట్టు చెప్పారు.

పోలీసులకు చిక్కిన గొలుసు చోరీ నిందితులు



వివరాలు వెల్లడిస్తున్న నేర విభాగం ఏసీపీ లక్ష్మణరావు, సీఐ చక్రధరరావు, ఎస్ఐ అప్పలరాజు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల వ్యవధిలో మూడు గొలుసు చోరీలను ద్వారకా జోన్ నేర విభాగం పోలీసులు ఛేదించారు. వీటికి సంబంధించిన వివరాలను ఎంవీపీ నేర విభాగం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ లక్ష్మణరావు, సీఐ చక్రధరరావు, ఎస్ఐ అప్పలరాజు వెల్లడించారు. గొలుసు దొంగతనాల్లో ఓ కేసులో ఇద్దరు నిందితులు మహా క్రిమినల్స్ ఉన్నారు. పోలీసులు చాకచక్యంగా దర్యాప్తు చేసి, ప్రాణాలకు తెగించి నిందితులను పట్టుకున్నారు. ఎస్ఐలు అప్పలరాజు, రాజు, ఏఎస్ఐ కిషోర్‌బాబు, కానిస్టేబుళ్లు హరి ప్రసాద్, జగత్ కిరణ్, సాయి, అప్పలరాజు, అగస్టీన్, రవి, శేఖర్‌లను డీసీపీ లతా మాధురి, ఏడీసీపీ మోహన్‌రావు అభినందించినట్లు ఏసీపీ తెలిపారు.

ఫోన్ పే పట్టించింది..

శివాజీపాలెం సాయిబాబా గుడి సమీపంలో నివాసం ఉంటున్న గుగ్గిలపు శోభారాణి ఈ నెల 10న ఉదయం ఆరున్నర గంటల సమయంలో ఇంటి ముందు వాలికి ఊడుస్తుండగా, ద్విచక్ర వాహనంపై వచ్చిన దుండగులు ముందు చిరునామా, అనంతరం మంచినీళ్లు అడిగారు. అదను చూసి ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. ద్వారకా ఎస్ఐ రాజు బృందం దీనిపై చురుగ్గా దర్యాప్తు చేపట్టింది. సీసీ ఫుటేజీలను సేకరించి, వారు వినియోగించిన ద్విచక్రవాహనాన్ని ఓ చోట స్వాధీనం చేసుకుంది. నగరంలోని ఓ లాడ్జిలో ఎలాంటి పత్రాలు లేకుండా దిగినట్టు తెలుసుకున్నారు. సదరు లాడ్జిలో ఫోన్ పే ద్వారా గదికి అద్దె చెల్లించడంతో దీని ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు. నేరానికి పాల్పడిన ఇద్దరు నిందితులు విజయవాడ ప్రాంతీయులుగా నిర్ధారించుకుని బృందం అక్కడకు చేరుకొంది. విచారణలో వారు మహా క్రిమినల్స్‌గా తేలింది. విశాఖలో అయిదు చోరీల్లో వీరు నిందితులు. విజయవాడ కుమ్మరిపాలెం ప్రాంతానికి చెందిన షేక్ ఇమ్రాన్(27) అలియాస్ 220 ఇమ్రాన్ అలియాస్ షాను 25 కేసుల్లో నిందితుడు. పదహారు ఎన్‌బీ వారెంట్లు ఉన్నాయి. పోలీసులను తప్పించుకుని తిరుగుతున్న ఇమ్రాన్‌పై హత్యాయత్నం, దోపిడీ, చోరీలు వంటి అనేక కేసులు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి ముత్యాలచెరువు గీతా మందిర్ రోడ్డులో ఉంటున్న నామాల నాగరాజు(33)పై 35కి పైగా కేసులు ఉన్నాయి. వీరిని అరెస్టు చేసే ప్రయత్నంలో పోలీసులు చాలా ఇబ్బందులు పడ్డారు. నిందితులు కత్తులతో పోలీసులపై దాడికి ప్రయత్నించినా ప్రాణాలకు తెగించి వీరిని పట్టుకుని జైలుకు పంపారు. వీరి వద్ద నుంచి ఎనిమిది తులాల బంగారం, రూ.30 వేల నగదు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

మద్దిలపాలెం చైతన్యనగర్‌లో ఉంటున్న పెరియాల హేమలత(75) వద్దకు ఇల్లు అద్దెకు కావాలని ఈ నెల 15న వచ్చిన వ్యక్తి, ఆమె మెడలోని బంగారు గొలుసు, చేతి గాజులు లాక్కొని పారిపోయాడు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి కేఆర్‌ఎం కాలనీలో నివాసం ఉంటున్న విజయనగరం జిల్లాకు చెందిన సిరిపురపు వెంకటరమణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. దోచిన బంగారం ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలో తాకట్టు పెట్టి, రూ.2,80,500 రుణం తీసుకున్నట్లు నిందితుడు అంగీకరించాడు. ఇతడి వద్ద నుంచి రూ.10 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఎలక్ట్రీషియన్‌గా చేస్తుంటాడని సమాచారం.

ఎంవీపీ కాలనీ ఎనిమిదో సెక్టరులో ఉంటున్న సేవన లలిత(90) అనే వృద్ధురాలి మెడలోని రెండు తులాల బంగారు గొలుసును ఈ నెల 15న ఓ వ్యక్తి లాక్కొని పారిపోయాడు. ఈ సంఘటనలో చురుగ్గా దర్యాప్తు చేసిన పోలీసులు రైల్వే న్యూకాలనీకి చెందిన పిడుగు జగదీష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు చోరీ సొత్తును ఫెడరల్ బ్యాంకులో రూ.1.29 లక్షలకు తాకట్టు పెట్టాడు.

లేజర్ రీ ప్రాక్టీస్ సర్జరీతో కళ్లద్దాలకు చెక్

- ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్యురాలు డాక్టర్ మరియా బషీర్

ఆరిలోవ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : లేజర్ రీ ప్రాక్టీస్ సర్జరీలు కళ్లద్దాలపై ఆధార పడడాన్ని తగ్గించి మెరుగైన కంటి చూపును అందిస్తుందని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్యురాలు డాక్టర్ మరియా బషీర్ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. లేజర్ సోర్స్‌ను ఉపయోగించి కళ్ళలోని కార్నియా ఒంపును సరిదిద్దడం లేజర్ రీ ప్రాక్టీస్ సర్జరీ ద్వారా సాధ్యమన్నారు. అయితే రోగి వయస్సు 21 సంవత్సరాలు నిండి ఉండాలని, కనీసం ఒక సంవత్సరం పాటు స్థిరమైన దృష్టి కలిగి ఉండాలన్నారు. ఆవర్తన దోషం అతి తక్కువగాను మితంగాను ఉండాలని, రోగి కళ్లు మంచి మందంగల కార్నియాలు కలిగి ఉంటేనే ఈ సర్జరీకి అవకాశం ఉంటుందన్నారు. నీటికాసులు కెరాటోకోనెస్ కంటి శుక్లాలు లాంటి ఇతర కంటి వ్యాధులు లేకపోతే లేజర్ రీ ప్రాక్టీస్ సర్జరీ ద్వారా కళ్లద్దాలు లేకుండా డ్రైవింగ్ చేయగలిలినంత స్పష్టంగా చూడగలిగే దృషి లభిస్తుందని ఆమె తెలిపారు. కళ్లద్దాలపై ఆధారపడకుండా చేయడం, కంటిచూపును త్వరితగతిన పొందడం వంటి ప్రయోజనాలు ఈ సర్జరీ ద్వారా పొందవచ్చన్నారు.

కెమికల్ కళాశాల ఓఎస్డీగా సాయిలక్ష్మి

కంచరపాలెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ కళాశాల ఓఎస్డీ (ఆఫీస్ సూపరింటెండెంట్)గా కిల్లి సాయిలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఇక్కడే విధులు నిర్వహించారు. పదోన్నతి పొంది మళ్లీ ఇదే కళాశాలకు వచ్చిన ఆమెను ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, అధ్యాపకులు, సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కనక మహాలక్ష్మి దేవస్థానం ఏఈఓగా రాజేంద్ర కుమార్

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఏఈఓ)గా పనిచేస్తున్న కె.రాజేంద్రకుమార్‌ను వన్‌టౌన్‌లోని కనక మహాలక్ష్మి దేవస్థానం ఏఈఓగా బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రైల్వేస్టేషన్‌లో జీఎం తనిఖీలు

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శుక్రవారం విశాఖ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. ప్లాట్‌ఫామ్‌లపై ప్రయాణికులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఫుట్ ఓవర్‌బ్రిడ్జిలు, లిఫ్టులు, ఎస్కలేటర్ల సౌకర్యాలపై స్థానిక సిబ్బందితో మాట్లాడి పలు అంశాలపై ఆరా తీశారు. అనంతరం స్టేషన్ భవనం అభివృద్ధి పనులు, సర్క్యులేటింగ్ ప్రాంతంలో చేపట్టిన వివిధ ప్రాజెక్టు పనులపై గతిశక్తి అధికారులతో చర్చించారు. రూట్ రిలే క్యాబిన్ (ఆర్ఆర్ఐ) తనిఖీలు చేసి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై చర్చించారు.

మే 14 నుంచి ఎర్నిమాంబ ఆలయ వార్షికోత్సవం

జ్ఞానాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు మే 14 నుంచి 18 వరకూ నిర్వహించనున్నట్లు ఈవో డీవీఎస్ సురేష్ బాబా తెలిపారు. గతంలో రెండు రోజులు జరిగిన ఉత్సవాలు, భక్తుల సౌకర్యార్థం ఈ ఏడాది నుంచి అయిదు రోజులకు పొడిగించినట్లు చెప్పారు. మే 14న రాటోత్సవం, చాటింపు, 15, 16 తేదీల్లో సాంస్కృతికోత్సవాలు, 17న తొలేళ్ళు, 18న వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఉత్సవాల నిర్వహణకు అవసరమైన సామగ్రి కోసం టెండర్లు పిలిచామని చెప్పారు.

బీజేఎంసీ అధ్యక్షుడిగా శివగణేష్

జ్ఞానాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా మజ్దూర్ సెల్ (బీజేఎంసీ) జిల్లా అధ్యక్షుడిగా కండేల శివగణేష్ నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన సమావేశంలో శివ గణేష్‌ను నియమిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు షేక్ ఖలిఫతుల్లా బాషా అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా శివ గణేష్ మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న జీవనోపాధి తదితర సమస్యలు, శ్రమ హక్కులపై స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో కండిపిల్లి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


శివగణేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

పోలీసులకు చిక్కిన గొలుసు చోరీ నిందితులు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల వ్యవధిలో మూడు గొలుసు చోరీలను ద్వారకా జోన్ నేర విభాగం పోలీసులు ఛేదించారు. వీటికి సంబంధించిన వివరాలను ఎంవీపీ నేర విభాగం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ లక్ష్మణరావు, సీఐ చక్రధరరావు, ఎస్ఐ అప్పలరాజు వెల్లడించారు. గొలుసు దొంగతనాల్లో ఓ కేసులో ఇద్దరు నిందితులు మహా క్రిమినల్స్ ఉన్నారు. పోలీసులు చాకచక్యంగా దర్యాప్తు చేసి, ప్రాణాలకు తెగించి నిందితులను పట్టుకున్నారు. ఎస్ఐలు అప్పలరాజు, రాజు, ఏఎస్ఐ కిషోర్‌బాబు, కానిస్టేబుళ్లు హరి ప్రసాద్, జగత్ కిరణ్, సాయి, అప్పలరాజు, అగస్టీన్, రవి, శేఖర్‌లను డీసీపీ లతా మాధురి, ఏడీసీపీ మోహన్‌రావు అభినందించినట్లు ఏసీపీ తెలిపారు.

ఫోన్ పే పట్టించింది..

శివాజీపాలెం సాయిబాబా గుడి సమీపంలో నివాసం ఉంటున్న గుగ్గిలపు శోభారాణి ఈ నెల 10న ఉదయం ఆరున్నర గంటల సమయంలో ఇంటి ముందు వాలికి ఊడుస్తుండగా, ద్విచక్ర వాహనంపై వచ్చిన దుండగులు ముందు చిరునామా, అనంతరం మంచినీళ్లు అడిగారు. అదను చూసి ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. ద్వారకా ఎస్ఐ రాజు బృందం దీనిపై చురుగ్గా దర్యాప్తు చేపట్టింది. సీసీ ఫుటేజీలను సేకరించి, వారు వినియోగించిన ద్విచక్రవాహనాన్ని ఓ చోట స్వాధీనం చేసుకుంది. నగరంలోని ఓ లాడ్జిలో ఎలాంటి పత్రాలు లేకుండా దిగినట్టు తెలుసుకున్నారు. సదరు లాడ్జిలో ఫోన్ పే ద్వారా గదికి అద్దె చెల్లించడంతో దీని ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు. నేరానికి పాల్పడిన ఇద్దరు నిందితులు విజయవాడ ప్రాంతీయులుగా నిర్ధారించుకుని బృందం అక్కడకు చేరుకొంది. విచారణలో వారు మహా క్రిమినల్స్‌గా తేలింది. విశాఖలో అయిదు చోరీల్లో వీరు నిందితులు. విజయవాడ కుమ్మరిపాలెం ప్రాంతానికి చెందిన షేక్ ఇమ్రాన్(27) అలియాస్ 220 ఇమ్రాన్ అలియాస్ షాను 25 కేసుల్లో నిందితుడు. పదహారు ఎన్‌బీ వారెంట్లు ఉన్నాయి. పోలీసులను తప్పించుకుని తిరుగుతున్న ఇమ్రాన్‌పై హత్యాయత్నం, దోపిడీ, చోరీలు వంటి అనేక కేసులు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి ముత్యాలచెరువు గీతా మందిర్ రోడ్డులో ఉంటున్న నామాల నాగరాజు(33)పై 35కి పైగా కేసులు ఉన్నాయి. వీరిని అరెస్టు చేసే ప్రయత్నంలో పోలీసులు చాలా ఇబ్బందులు పడ్డారు. నిందితులు కత్తులతో పోలీసులపై దాడికి ప్రయత్నించినా ప్రాణాలకు తెగించి వీరిని పట్టుకుని జైలుకు పంపారు. వీరి వద్ద నుంచి ఎనిమిది తులాల బంగారం, రూ.30 వేల నగదు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మద్దిలపాలెం చైతన్యనగర్‌లో ఉంటున్న పెరియాల హేమలత(75) వద్దకు ఇల్లు అద్దెకు కావాలని ఈ నెల 15న వచ్చిన వ్యక్తి, ఆమె మెడలోని బంగారు గొలుసు, చేతి గాజులు లాక్కొని పారిపోయాడు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి కేఆర్ఎం కాలనీలో నివాసం ఉంటున్న విజయనగరం జిల్లాకు చెందిన సిరిపురపు వెంకటరమణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. దోచిన బంగారం ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలో తాకట్టు పెట్టి, రూ.2,80,500 రుణం తీసుకున్నట్లు నిందితుడు అంగీకరించాడు. ఇతడి వద్ద నుంచి రూ.10 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఎలక్ట్రీషియన్‌గా చేస్తుంటాడని సమాచారం.

ఎంవీపీ కాలనీ ఎనిమిదో సెక్టరులో ఉంటున్న సేవన లలిత(90) అనే వృద్ధురాలి మెడలోని రెండు తులాల బంగారు గొలుసును ఈ నెల 15న ఓ వ్యక్తి లాక్కొని పారిపోయాడు. ఈ సంఘటనలో చురుగ్గా దర్యాప్తు చేసిన పోలీసులు రైల్వే న్యూకాలనీకి చెందిన పిడుగు జగదీష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు చోరీ సొత్తును ఫెడరల్ బ్యాంకులో రూ.1.29 లక్షలకు తాకట్టు పెట్టాడు.

సంస్థాగత ఎన్నికలకు సహకరించండి: ఎంపీ శ్రీభరత్


పద్మలతకు గుర్తింపు కార్డు అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ, ఇతర నాయకులు

మహారాణిపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి నుంచే పార్టీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు కార్యకర్తలు కృషిచేయాలని, ప్రతీ వార్డులో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక జరిగేలా దోహదపడాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ సూచించారు. టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులలో సమావేశాలు నిర్వహించి అందరి అభిప్రాయాల మేరకు కమిటీని ఎన్నుకోవాలని, ఏకాభిప్రాయంతో సాధ్యం కాకపోతే జిల్లా అధ్యక్షుడి దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, దువ్వారపు రామారావు, భరత్, హనోక్, పైలా ముత్యాలనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పద్మలతకు సభ్యత్వ నమోదు బాధ్యత

24వ వార్డు టీడీపీ అధ్యక్షురాలు బర్ల పద్మలత సభ్యత్వ నమోదు, తదితర అంశాలలో ప్రతిభ కనబరిచారు. సభ్యత్వ నమోదులో ఎలాంటి సమస్యనైనా ఆమె పరిష్కరించగలగడంతో ఎంపీ శ్రీభరత్ జిల్లాలో సభ్యత్వ నమోదు ప్రక్రియ, సమస్యల పరిష్కార బాధ్యతను తీసుకోవాలని పద్మలతకు సూచించారు.

పెళ్లి పేరుతో మోసగించి హత్యకు యత్నిస్తున్నాడని ఫిర్యాదు

సీతంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తనను ప్రేమ పేరుతో నమ్మించి లోబరచుకోవడమేగాక నగ్న వీడియోలు, చిత్రాలు తీసి బ్లాక్‌మెయిల్ చేస్తూ చంపడానికి యత్నిస్తున్నాడని ఓ వ్యక్తిపై నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో యువతి ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఓ యువతి తల్లి బరువు అధికంగా ఉండటంతో హెర్బల్ పౌడర్ వాడే క్రమంలో శ్రీకాకుళం సమీపంలోని పెదపాడుకి చెందిన ఓ యువకుడి కుటుంబంతో పరిచయమైంది. అతడు కొద్దికాలం క్రితం అక్కయ్యపాలెం వచ్చి జిమ్ చేస్తూ, హెర్బల్ పౌడర్లు అమ్మేవాడు. అతడి తండ్రి వారి సామాజికవర్గీయులకు వివాహ సంబంధాలు చూస్తుంటాడు. ఈ క్రమంలో నిందితుడు బాధిత యువతితో స్నేహం పెంచుకుని ప్రేమ పేరుతో నమ్మించాడు. అతని కుటుంబికులూ ఆమెకు బాగా పరిచయమయ్యారు. వారు కూడా యువతితో ప్రేమ, పెళ్లి అంటూ ఆమె వద్ద డబ్బు తీసుకున్నారు. యువతిని గర్భవతిని చేశాక అబార్షన్ చేయించాడు. ఆమె నగ్న వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెడతానని బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. తనను దారుణంగా కొట్టి, దుర్భాషలాడారని పోలీసులకు తెలిపింది. తనను చంపడానికి రూ.20 వేలు సుపారి ఇచ్చాడని ఆరోపించింది. అతడి వద్ద మరో 30 మంది యువతుల నగ్న వీడియోలు ఉన్నాయని పోలీసులకు తెలిపింది. తనకు న్యాయం చేయాలని, ఇంకెవరూ మోసపోకుండా చర్యలు తీసుకోవాలని కోరింది. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

విమానాశ్రయంపై నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

ఎక్కడికైనా సరే విశాఖపట్నం మీదుగానే వెళ్లాలి. ఇక్కడి విమానాశ్రయంలోనే విమానం ఎక్కాలి. ఓ అర గంట సమయం కేటాయించి ఇక్కడి సమస్యలపై దృష్టిసారించాలని నగర వాసులు కోరుకుంటున్నారు. రద్దయిన విమానాలు వెంటనే పునరుద్ధరణ జరిగేలా, కొత్త సర్వీస్‌లు వచ్చేలా చేయాల్సిన ఆవశ్యకత చాలా ఉంది.

గతంలో విశాఖ నుంచి దుబాయ్‌కు అంతర్జాతీయ విమాన సర్వీస్ ఉండేది. వాస్తవానికి ఇక్కడి నుంచి ప్రారంభమైన తొలి విదేశీ విమానం అదే. ఇండియన్ ఎయిర్‌లైన్స్ నడిపింది. కరోనా సమయంలో రద్దయిన ఆ విమానం మళ్లీ పునరుద్ధరణ జరగలేదు. విశాఖ కంటే అనేక విధాలుగా తరువాత స్థానంలో విజయవాడకు మాత్రం దుబాయ్ విమానం నడుస్తోంది. కేంద్ర మంత్రి తక్షణమే విశాఖలో ఓ సమావేశం ఏర్పాటుచేసి, విమాన సర్వీస్‌లతో పాటు కార్గో సేవలు కూడా ప్రారంభమయ్యేలా చూడాల్సి ఉంది. ఉడాన్ యాత్రీ క్యాంటీన్ రుచులను ఇక్కడి ప్రయాణికులకు పరిచయం చేసే బాధ్యత తీసుకోవాలి.

టీసీఎస్ ఆగమనం ఐటీ అభివృద్ధికి సంకేతం

... 5వ పేజీ తరువాయి

భవిష్యత్తులో మరిన్ని కంపెనీలు రానున్నాయన్నారు. రుషికొండలో ఇన్ఫోసిస్ కార్యకలాపాలు విస్తరిస్తోందని పేర్కొన్నారు. రుషికొండ ఐటీ పార్కులో మౌలిక సదుపాయాల కల్పనలో గత వైసీపీ ప్రభుత్వం విఫలమైందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వీధి లైట్లు ఏర్పాటుచేయడం, బస్ సౌకర్యం కల్పించడం వంటివి చేశామన్నారు. ఐటీ కంపెనీలకు పెండింగ్‌లో పెట్టిన ఇన్సెంటివ్‌లను దశల వారీగా విడుదల చేస్తున్నామని వెల్లడించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వైసీపీ దొంగ ఏడ్పులు ఏడుస్తోందని శ్రీభరత్ విమర్శించారు. గత ఐదేళ్లలో ఉత్తరాంధ్రను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన విషయం మరిచిపోయి, ఇప్పుడు అబద్ధపు ప్రచారానికి పాల్పడుతుందని దుయ్యబట్టారు. రెండు దశాబ్దాల క్రితం విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించిన హెచ్ఎస్‌బీసీ నగరం నుంచి తరలిపోతున్నా కనీసం వారిని పిలిచి మాట్లాడలేదన్నారు. టీసీఎస్‌కు కారుచౌకగా భూమి ఇచ్చారని గోబెల్స్ ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకులు, ఒక వ్యక్తి కోసం రూ.450 కోట్లతో రుషికొండపై ప్యాలెస్ ఎందుకు కట్టారో చెప్పాలన్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దృష్టిసారించిందని శ్రీభరత్ పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తయ్యేనాటికి విశాఖ నుంచి కనెక్టివిటీ పెంపునకు వీఎంఆర్‌డీఏ రూ.400 కోట్లతో 17 మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మించనున్నదన్నారు. విశాఖ నుంచి విమానాల రద్దుపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో మాట్లాడామని, రైల్వే జోన్ కార్యకలాపాలు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. లులు కంపెనీ రూ.1800 కోట్ల పెట్టుబడులు పెడుతుందని, దీని వల్ల విశాఖలో టూరిజం విస్తరిస్తుందన్నారు. లులూ కంపెనీ విశాఖతో పాటు విజయవాడ, రాజమండ్రి, తిరుపతిలో మాల్స్ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో అభివృద్ధి చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి కారణమైన వారికి మాట్లాడే హక్కులేదన్నారు. గడచిన పది నెలల్లో విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ.11,404 కోట్లు సాయం అందించామన్నారు. వైసీపీ నాయకులు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని అప్పలనాయుడు అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి నారా లోకేశ్‌లు ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దృష్టిసారించారన్నారు. విలేకరుల సమావేశంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, పాల్గొన్నారు.

మూతపడిన ఫిట్జీ

... 5వ పేజీ తరువాయి

బ్రాంచీలను తెరిచింది. ఒక్కో విద్యార్థి నుంచి ఏడాదికి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఫీజుగా వసూలు చేసింది. ఎంవీపీ బ్రాంచిలో గత విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో సుమారు 220 మంది చేరారు. విద్యా సంవత్సరం సగం కూడా గడవకముందే రెండో ఏడాది ఫీజునూ వసూలు చేశారు. ఇదిలావుండగా అక్టోబరు నుంచే గడ్డుకాలం ప్రారంభమయింది. యాజమాన్యం జీతాలు ఇవ్వడం లేదంటూ అధ్యాపకులు ఒక్కొక్కరుగా కళాశాలను విడిచిపెట్టి వెళ్లిపోయారు. పరీక్షల ముందు ఈ పరిస్థితి తలెత్తడంతో కొంతమంది తమ పిల్లలను ఇతర కళాశాలల్లో చేర్పించారు. మిగిలినవారు అక్కడే పరీక్షలు రాశారు. వచ్చే విద్యా సంవత్సరంలో కూడా క్లాసులు నడిచే పరిస్థితి లేకపోవడంతో తాము చెల్లించిన ఫీజు వాపసు చేయాలని తల్లిదండ్రులు కళాశాల చుట్టూ తిరుగుతున్నారు. ఆ లేఖలు ఢిల్లీలో ఉన్న యాజమాన్యానికి పంపించడం మినహా తాము ఏమీ చేయలేమని సిబ్బంది చెబుతున్నారు. విద్యార్థుల జీవితంతో ఆడుకున్న ఫిట్జీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం కళాశాల ఎదుట నిరసన తెలిపిన అనంతరం ఎంవీపీ పోలీసులను ఆశ్రయించారు. ప్రస్తుతం కళాశాలలో ముగ్గురు కింది స్థాయి సిబ్బంది మాత్రమే ఉన్నారు. శాంతిపురం బ్రాంచి వద్ద కూడా బోర్డు కూడా తొలగించారు.

చర్యలు తీసుకుంటాం

కళాశాల మూసివేయాల్సిన పరిస్థితి వస్తే, విద్యార్థులకు ప్రత్యామ్నాయం చూపించాలి. తల్లిదండ్రులు ఒకేసారి రెండు సంవత్సరాల ఫీజు చెల్లించకూడదు. అర్ధంతరంగా మూసివేసిన ఫిట్జీ జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం.
- పి.మురళీధర్, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి, ఇంటర్ బోర్డు

మహా ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

టీడీపీ నుంచి గెలిచిన ఒకరు వైసీపీలో చేరిపోయారు. ఆ తర్వాత జరిగిన 32వ వార్డు ఉప ఎన్నికల్లో టీడీపీ స్థానాన్ని వైసీపీ దక్కించుకోవడంతో కౌన్సిల్‌లో ఆ పార్టీకి ఎదురులేకుండాపోయింది. అయితే 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో కౌన్సిల్‌లో సమీకరణాలు తలకిందులైపోయాయి. వైసీపీ నుంచి గెలిచిన 19 మంది కార్పొరేటర్లు టీడీపీలో, మరో తొమ్మిది మంది జనసేనలో చేరిపోయారు. ఇండిపెండెంట్‌లుగా గెలిచిన నలుగురిలో ఇద్దరు టీడీపీ, మరో ఇద్దరు జనసేనలో చేరిపోయారు. ఈ నేపథ్యంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై అవిశ్వాసం ప్రకటిస్తూ కూటమి కార్పొరేటర్లు 58 మంది సంతకాలు చేసి గత నెల 21న జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌కు నోటీస్ ఇచ్చారు. అందులో సంతకాల ధ్రువీకరణ అనంతరం అవిశ్వాస తీర్మానంపై శనివారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

తీర్మానం నెగ్గాలంటే 74 మంది సభ్యుల మద్దతు అవసరం

మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై శనివారం ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే కూటమికి 74 మంది సభ్యుల మద్దతు అవసరం. జీవీఎంసీలో 97 మంది కార్పొరేటర్లతోపాటు 14 మంది ఎక్స్‌అఫిషియో సభ్యులు కలుపుకుని 111 మంది ఓటుహక్కు కలిగిన సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం టీడీపీకి 48, జనసేనకు 14, బీజేపీకి ఇద్దరు కార్పొరేటర్లు మొత్తం కూటమికి 64 మంది కార్పొరేటర్ల బలం ఉంది. వైసీపీకి 30 మంది, సీపీఐ, సీపీఎంకి ఒక్కొక్కరు ఉన్నారు. ఇటీవలే వైసీపీకి రాజీనామా చేసిన ఆరో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక (మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుమార్తె) తన వైఖరిని ఇంకా ప్రకటించలేదు. సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానంపై జరిగే సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. వైసీపీ కూడా సమావేశాన్ని బహిష్కరించాలని నిర్ణయించింది. కూటమి చేతిలో ఉన్న 64 మంది కార్పొరేటర్లతోపాటు 11 మంది ఎక్స్‌అఫిషియో సభ్యులు సమావేశానికి హాజరైతే అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు అవకాశం ఉంటుంది. వీరితోపాటు ముత్తంశెట్టి ప్రియాంక కూడా హాజరయ్యే అవకాశం ఉందంటున్నారు.

వైరివర్గాల్లోని సభ్యుల కోసం కొనసాగుతున్న నేతల వేట

అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు కూటమికి 74 మంది సభ్యుల మద్దతు తప్పనిసరి. అయితే ఆ సంఖ్యను చేరకుండా వైసీపీ నేతలు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అందుకోసం కొద్దిరోజుల కిందట వరకు తమ పార్టీలో ఉండి ప్రస్తుతం కూటమిలో చేరిన కార్పొరేటర్లను తిరిగి తమ వైపు లాక్కోవాలని చూస్తున్నారు. తెలుగుదేశం కార్పొరేటర్లంతా శుక్రవారం రాత్రివరకూ మలేషియాలో ఉండడంతో నగరంలో ఉన్న వారి కుటుంబసభ్యుల ద్వారా సంప్రతింపులు జరిపినట్టు తెలిసింది. ఒకరిద్దరు కార్పొరేటర్లను భారీ నజరానా ఆశ చూపించి కౌన్సిల్ సమావేశానికి హాజరుకాకుండా నిరోధించడం లేదంటే కౌన్సిల్‌కు హాజరైనా సరే అవిశ్వాసానికి మద్దతుగా చెయ్యి ఎత్తకుండా ఉండిపోయేలా ఒప్పందం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతుండడం కూటమి నేతలను ఆందోళనకు గురిచేస్తోంది. గాజువాక ప్రాంతానికి చెందిన ఒక కార్పొరేటర్ మలేషియా విమానాశ్రయం నుంచి తప్పించుకుని వెళ్లిపోయారని ప్రచారం జరుగడంతో కూటమి నేతలు అప్రమత్తమై ప్రతి కార్పొరేటర్ వెనుక ప్రత్యేకంగా మనుషులను కాపలా పెట్టుకున్నారు. మరోవైపు కూటమి నేతలు కూడా తమలో కొందరు దెబ్బకొట్టినా సరే అవిశ్వాస తీర్మానం నెగ్గేలా ముందుజాగ్రత్తగా వైసీపీలోని ఇద్దరు, ముగ్గురు సభ్యులను తమ వైపు తిప్పుకునేందుకు యత్నిస్తున్నారు. అందుకోసం కేరళ, శ్రీలంకలో ఉన్న వైసీపీ కార్పొరేటర్ల వద్దకు మనుషులను పంపినట్టు సమాచారం. వీలైతే రాత్రికే వారిని అక్కడి నుంచి నగరానికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇరువర్గాలు ఎత్తుకుపైఎత్తులు వేస్తుండడంతో ఫలితంపై ఉత్కంఠ నెలకొంది.

కేజీహెచ్‌లో ఇన్‌చార్జి మంత్రి తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

వెల్లడించారు. మూడు నెలల్లో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. వైద్యులు, సిబ్బంది రోగులకు సంతృప్తికరమైన సేవలు అందించాలని ఆదేశించారు. సెక్యూరిటీ, పారిశుధ్య సేవలను మరింత మెరుగుపరచాలని, యూజీడీ వ్యవస్థలో లోపాలను సరిచేయాలని సూచించారు. దశల వారీగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని మంత్రి తెలిపారు. ఫార్మసీ కౌంటర్లు పెంచాలని, టోకెన్ డిస్‌ప్లే వ్యవస్థను అమలు చేయాలని సూచించారు. కేజీహెచ్‌లో అదనపు పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. కేవలం కేజీహెచ్‌పైనే భారం పడకుండా అనుబంధ ఆసుపత్రుల్లో మెడికో లీగల్ కేసుల పరీక్షలు నిర్వహించాలని మంత్రి సూచించారు. జనన ధ్రువీకరణ, శిశు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఏఎంసీ విద్యార్థుల కోసం గ్యాలరీలు ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి డోలా తెలిపారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. దక్షిణ నియోజకవర్గ శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవి లత, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి, ఆర్ఎంవో డాక్టర్ మెహర్ కుమార్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెట్‌వర్క్ ఆస్పత్రులు క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ చేయాల్సిందే..

... 5వ పేజీ తరువాయి

ఉన్నారు. వారితోపాటు ఉద్యోగుల హెల్త్ స్కీమ్ పథకంలో భాగంగా రెండు లక్షల కుటుంబాలకు, జర్నలిస్టు హెల్త్ స్కీమ్ కింద మరో వేయి మంది కుటుం బాలకు అందించే వైద్య సేవలను పర్య వేక్షిస్తున్నాం. వీరికి ఏ ఇబ్బందులు ఉన్నా మాకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

ప్ర: ఆయుష్మాన్ భారత్ పథకం లబ్ధిదారులు ఎంతమంది?

జ: కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఉచితంగా నిరుపేదలకు వైద్య సేవలు అందించేందుకు హెల్త్ కార్డులు అందిస్తోంది. ఈ పథకానికి జిల్లాలో 9,11,697 మంది అర్హులుగా గుర్తించింది. వీరిలో ఇప్పటివరకూ 6,95,049 మందికి ఈకేవైసీ పూర్తి చేశాం. కార్డులు పంపిణీ ప్రక్రియను కూడా త్వరలోనే పూర్తిచేస్తాం. ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్‌లో ఉన్న ఆస్పత్రులన్నింటిలోనూ దాదాపు ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఉచిత వైద్య సేవలు అందుతాయి. ఈ పథకంలో భాగంగా ఐదు లక్షల వరకూ ఉచిత ఆరోగ్య బీమా లభిస్తుంది. 70 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరికీ ఈ కార్డులను అందిస్తున్నాం.

ప్ర: సమస్యలుంటే ఎవరిని సంప్రతించాలి?

జ: ఆస్పత్రిలో చేరిన దగ్గర నుంచి డిశ్చార్జ్ అయ్యేంత వరకు ఎటువంటి సమస్య ఉన్నా ఫిర్యాదు చేయవచ్చు. ఆరోగ్య మిత్రలు ప్రతిరోజూ బెడ్‌సైట్ విజిట్ చేయాలి. క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ చేయించే బాధ్యత ఆరోగ్య మిత్రలపై ఉంటుంది. నేను కూడా టీమ్‌తో ప్రతిరోజూ కనీసం మూడు నుంచి ఐదు ఆస్పత్రులు విజిట్ చేస్తుంటా. రోగులతో స్వయంగా మాట్లాడి ఇబ్బందులు తెలుసుకుంటాం. కొన్నిసార్లు డిశ్చార్జ్ అయి వెళ్లిన రోగులతో ఫోన్‌లో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందాయన్న విషయాన్ని కూడా తెలుసుకుంటాం.

వాహనాల చోరీ కేసులో ఇద్దరు ఒడిశావాసుల అరెస్టు


నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

మహారాణిపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలు దొంగిలించిన అంతర్రాష్ట్ర ముఠాను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అల్లిపురానికి చెందిన షేక్ రంజాన్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం రాత్రి ఇంటి ముందు పార్కు చేయగా తెల్లారేసరికి అదృశ్యమైంది. దీనితో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో అనుమానితులైన ఒడిశాలోని కొరాపుట్ ప్రాంతానికి చెందిన కార్తిక్ కిల్లో, బబ్లూ సుపియాలను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా మరో ఎనిమిది ద్విచక్రవాహనాలను సైతం దొంగిలించినట్లు తేలింది. వారి వద్ద నుంచి మొత్తం తొమ్మిది వాహనాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని ఆత్మహత్య

సీతంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఇంటిలో ఫ్యానుకు తువ్వాలతో ఉరేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సీతంపేట రెల్లివీధికి చెందిన దేవులపల్లి రవి (40) తన భార్య పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. కూలి పనులు చేసేవాడు. మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం మద్యం తాగడానికి డబ్బులు అడిగి ఇంటిలో గొడవ పడ్డాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో కోపంతో బెదిరించి ఇంటి లోపలకు వెళ్లిపోయాడు. ఫ్యానుకు తువ్వాలు చుట్టి ఉరేసుకున్నాడు. లోపలకు వెళ్లిన మృతుడి భార్య, ఇరుగుపొరుగు వారు కిందికి దించారు. అయితే అప్పటికే రవి మృతి చెందాడు. ద్వారకా పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సీఐ డీవీ రమణ ఆధ్వర్యంలో ఏఎస్ఐ సీతామహాలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రత్యేక హోదా కోసం కృషిచేయాలి ; కాంగ్రెస్

మురళీనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి); ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన కోసం ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు కృషి చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు కోరారు. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ వ్యాఖ్యపై విచారం వ్యక్తంచేస్తూ శుక్రవారం ఆయన స్పందించారు. ప్రధాని మోదీ వాగ్దానం మేరకు ఏపీ ప్రజలు పదేళ్లుగా ప్రత్యేక హోదా ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు.

పెళ్లి పేరుతో మోసగించాడంటూ గర్భిణి ఫిర్యాదు

సీతంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి తాను గర్భం దాల్చాక ముఖం చాటేశాడంటూ నాలుగో పట్టణ పోలీసులకు ఓ మహిళ ఫిర్యాదు చేసింది. వారు తెలిపిన వివరాల ప్రకారం... దొండపర్తికి చెందిన బేరడం ఉమామహేశ్వరికి కొన్నేళ్ల క్రితం వివాహమైంది. దంపతుల మధ్య గొడవలు జరిగి పెద్దల సమక్షంలో విడిపోయారు. దీంతో ఆమె ఒక్కతే ఉంటూ జిల్లా పరిషత్ ప్రాంతంలోని ఓ డయాగ్నో సెంటర్‌లో పని చేస్తోంది. ఈ క్రమంలో దొండపర్తికి చెందిన వరుసకు మామయ్య అయిన రవికుమార్ ఆమెతో స్నేహంగా ఉంటూ మాయ మాటలు చెప్పి శారీరకంగా లోబర్చుకున్నాడు. దీంతో ఆమె గర్భం దాల్చింది. విషయం తెలుసుకొని రవికుమార్ పెళ్లి చేసుకుంటానని చెప్పి గర్భం తీయించి మళ్లీ శారీరకంగా దగ్గరయ్యాడు. మళ్లీ ఆమె గర్భం దాల్చడంతో పెళ్లికి నిరాకరిస్తూ ముఖం చాటేశాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు కార్లు ఢీ.. త్రుటిలో తప్పిన ప్రమాదం


డివైడర్లు ఢీకొట్టి దెబ్బతిన్న కార్లు

కంచరపాలెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెం సిగ్నల్ పాయింట్ నుంచి కంచరపాలెం వైపు జాతీయ రహదారిపై వస్తున్న రెండు కార్లు ఢీకొట్టడంతో కార్లు ముందు భాగాలు నుజ్జయ్యాయి. శుక్రవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంతో జాతీయరహదారిపై ట్రాఫిక్ జామ్ అయ్యింది. తాటిచెట్లపాలెం సిగ్నల్ దాటి జాతీయ రహదారి ప్రధాన మార్గంలో వస్తున్న ఒక కారును అదే మార్గంలో సర్వీస్ రోడ్డులో వెళ్తున్న మరో కారు ధర్మానగర్ కటింగ్ పాయింట్ వద్ద ఢీకొట్టింది. రెండు కార్లు డివైడర్లను ఢీకొట్టి ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో రెండు కార్ల ముందు భాగాలు దెబ్బతిన్నాయి. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని కార్లను క్రేన్లతో బయటకు తీసి స్టేషన్‌కు తరలించారు. ఎటువంటి నష్టం జరగకపోవడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉక్కు ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపర్చాలి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 18 (ఆంధ్ర జ్యోతి) : స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపర్చాలని ఉక్కు కార్మిక సంఘ నాయకులు కోరుతున్నారు. ఇటీవల కాలంలో చాలా మంది ఈ ఆస్పత్రి ఉద్యోగులు వీఆర్‌ఎస్ తీసుకోవడం, పదవీ విరమణ చేయడంతో చాలా వరకు వైద్య సేవలు తగ్గిపోయాయని కార్మికనేతలు పేర్కొన్నారు. వైద్యులను నియమించి, పూర్తిస్థాయిలో వైద్య సేవలు అం దించి, మందులు అందుబాటులో ఉంచాల న్నారు. అలాగే పెదగంట్యాడ ఆస్పత్రిని గతంలో మాదిరిగా నడపాలని కోరుతున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గాజువాక, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పాతకర్ణవానిపాలెం రామాలయం నాలుగో వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మూడు రోజులపాటు విశేష పూజలు, సూర్యనమస్కారాలు, హోమాలు, రుద్రాభిషేకాలు నిర్వహిం చనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేకపూజలుచేపట్టారు.

చలివేంద్రం ఏర్పాటు

అగనంపూడి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ప్రధాన కూడలిలో మహా విశాఖ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని జీవీఎంసీ చలివేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో బి.సత్యనారాయణ, తలారి శ్రీనివాసరావు, కొలిపాక అప్పారావు, పైడికొండ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెందుర్తిలో...

పెందుర్తి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పెందుర్తికి చెందిన వేగి శ్రీనివాసరావు 17 ఏళ్లగా ఏటా వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఈఏడాదికి శుక్రవారం పెందుర్తి కూడలిలో చలివేంద్రం ప్రారంభించారు. తన తండ్రి జ్ఞాపకార్థం ఏటా వేసవిలో నాలుగు నెలలు పాటు చలివేంద్రం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం


అన్న సమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

ఆటోనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అన్నం పరబ్రహ్మ స్వరూపమని టీడీపీ రాష్ట్ర పరిశీలకులు పప్పు రాజారావు అన్నారు. ఆటోనగర్ వినాయక, ఆలయం వద్ద ప్రతి శుక్రవారం నిర్వహించే అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఏప్రిల్ 20న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదినం పురస్కరించుకుని ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని., చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రధాని మోదీల కృషి ఫలితంగా రాష్ట్రం సుభిక్షంగా మారాలని కోరుతూ పూజలు చేశామన్నారు. ప్రజలు ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలన్నారు. ఆలయ కమిటీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
● **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
● **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)
● **జాక్ :** రమాదేవి
● **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18,టమాటా 18, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 26, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 32, బీరకాయలు 40, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 14, క్యారెట్ 30 దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీర దోస 26, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 200, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన 3, చుక్కకూర 3, పాలకూర 3, తోటకూర 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	104
లైవ్ ధర	124
విత్ స్కిన్	218
స్కిన్‌లెస్	228

ఉక్కు నిర్వాసితుల ఆశలు ఆవిరి

» ఐదేళ్లుగా నియామకాల ప్రకటనల్లేవ్
» ప్రైవేటీకరణ ప్రకటనతో ప్రతిష్ఠంభన

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల ఆశలు రోజురోజుకూ ఆవిరవుతున్నాయి. ప్లాంటు ప్రైవేటీకరణ ప్రకటన నాటి నుంచి నేటివరకూ వందలాది మంది ఉద్యోగులు పదవీవిరమణ చేస్తూ వచ్చారు. కానీ గడిచిన ఐదేళ్లుగా ప్లాంటులో నియామకానికి ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడలేదు. ఈ ఏడాది మార్చి 31న సుమారు 1400 మంది శాశ్వత ఉద్యోగులు పదవీవిరమణ చేశారు. ఈ నెలలో 1503 మంది కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం తొలగించింది. ఇంకా కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఓ పక్క ఉద్యోగుల తొలగింపు, మరో పక్క ఉద్యోగుల పదవీ విరమణలు భారీగా జరుగుతుండడంతో ఉద్యోగుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. దీంతో ప్రస్తుతం విధులు నిర్వహించే ఉద్యోగులపై పని భారం పడుతుంది. నూతన నియామకాలు చేయాలని కార్మిక సంఘ నాయకులు యాజమాన్యానికి కోరినప్పటికీ ఫలితం లేదు. స్టీల్


విశాఖ స్టీల్‌ప్లాంటు

ప్లాంట్ నిర్మాణ సమయంలో సుమారు 17 వేల మంది వరకు నిర్వాసితులను గుర్తించి ఆర్ కార్డు (నిర్వాసిత గుర్తింపు కార్డు)లను ఇచ్చారు. ఆ సమయంలో సుమారు ఏడు వేల మందికి ఉపాధి కల్పించారు. తరువాత ప్లాంటు విస్తరణ సమయంలో మరో మూడు వేల మంది వరకు ఉపాధి కల్పించారు. ఇంకా సుమారు ఏడు వేల మంది నిర్వాసిత నిరుద్యోగులు ప్లాంట్‌లో ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. తొలి తరం వారు కాకుండా ఇప్పుడు మూడో తరం వారు ఉద్యోగాల కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే ప్రైవేటీకరణ క్రమంలో ప్లాంటులో అసలు నియామకాల ఊసే లేదు. దీంతో అసలు భవిష్యత్తులో ఆర్ కార్డుకు విలువ ఉంటుందా? అనే ప్రశ్న నిర్వాసిత నిరుద్యోగుల్లో కలుగుతోంది. ప్లాంట్‌లో ఉద్యోగం వస్తుందని చదువులు చదివి, అప్రెంటీస్ చేసిన వారు నేడు నిరుద్యోగులుగా మిగిలిపోయారు. ప్రభుత్వ పెద్దలు కలగజేసుకొని నిర్వాసితులకు న్యాయం చేయాలని వారంతా కోరుతున్నారు.

శాపంగా మారిన ప్రైవేటీకరణ



ప్లాంట్‌లో ఉపాధి వస్తే కుటుంబాలు బాగుంటాయని ఆశతో ఎదురు చూస్తున్న నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరిగింది. ఆర్ కార్డు ఉండీ ప్రయోజనం లేని విధంగా ప్రస్తుత పరిస్థితి మారింది. ప్రైవేటీకరణ ప్రకటన శాపంగా మారింది. ప్లాంటు కోసం సర్వం త్యాగం చేసిన వారికి అన్యాయం జరిగింది. నిర్వాసితుల సంఘం తరఫున భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తాం.

- యేల్లేటి శ్రీనివాసరావు, నిర్వాసిత సంఘం నాయకుడు

గల్లంతైన విద్యార్థి కోసం సముద్రంలో గాలింపు

» నేవీ హెలికాప్టర్, డ్రోన్ వినియోగిస్తున్న పోలీసులు


గంగవరం తీరంలో బాలుడి ఆచూకీ కోసం గాలింపు చేపడుతున్న దృశ్యం


డ్రోన్ సాయంతో గాలింపు

పెదగంట్యాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గంగవరం సముద్రతీరంలో గురువారం సాయంత్రం గల్లంతైన తొమ్మిదో తరగతి విద్యార్థి తనూజ్ (14) ఆచూకీ కోసం శుక్రవారం ఉదయం నుంచి చీకటి పడేవరకు గాలింపు చర్యలు కొనసాగాయి. తూర్పు నావికాదళం హెలికాప్టర్, న్యూపోర్టు పోలీసులు ఏర్పాటు చేసిన డ్రోన్ సాయంతో గాలించారు. ఇండియన్ కోస్ట్ గార్డ్ రెస్క్యూ టీమ్, నలుగురు గజ ఈతగాళ్లు సాగర తీరమంతా గాలించారు. యారాడ బీచ్ అప్పికొండ వరకు తీరం వరకు కొనసాగాయి. తీరం వెంబడి న్యూపోర్టు పోలీసులు గాలించారు. మత్స్యకారులను కూడా వాకబు చేశారు. శుక్రవారం రాత్రి వరకు విద్యార్థి ఆచూకీ లభ్యం కాలేదు. న్యూపోర్టు సీఐ టి.కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. శనివారం మళ్లీ కొనసాగిస్తామన్నారు.

కారు బోల్తా: ముగ్గురికి గాయాలు


బోల్తా పడిన కారు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 18 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధి బూసిపుట్టు పంచాయతీ తుడుమురాయి సమీపంలో శుక్రవారం పర్యాటకుల కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులందించిన వివరాలివి.. గాజువాక ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు పెదబయలు మండలం కుంజివాడ సమీపంలోని జలపాతాన్ని చూసేందుకు కారులో బయలుదేరారు. తుడుమురాయికి వచ్చేసరికి కారు అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయి పల్టీ కొట్టింది. దీంతో కారు నుజ్జయింది. స్థానికులు హుటాహుటిన ప్రమాదానికి గురైన కారు వద్దకు వెళ్లి ముగ్గురు యువకులను బయటకు తీశారు. వారు స్వల్పగాయాలతో బయట పడడంతో ఊపిరిపీల్చుకున్నారు.

నేడు దేవిశ్రీ ప్రసాద్ మ్యూజికల్ నైట్

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పోర్టు స్టేడియంలో శనివారం రాత్రి ప్రముఖ సినీ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ నేతృత్వంలో బృందం మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను దేవిశ్రీ ప్రసాద్ హోటల్ నోవాటెల్‌లో శుక్రవారం ఆవిష్కరించారు.

ఎల్‌బీ నగర్‌లో జోరుగా అక్రమ నిర్మాణాలు


ఎల్‌బీ నగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం

వేపగుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డు కృష్ణరాయపురం దరి ఎల్‌బీ నగర్ శ్మశానవాటిక ముందున్న ఏడో వీధి, పరిసర ప్రాంతా ల్లో అక్రమ భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. తప్పుడు పత్రాలతో పట్టాలు పొంది నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై కొందరు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముస్లింల ర్యాలీ



వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా గాజువాకలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

గాజువాక, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మైనారిటీస్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో వక్ఫ్ చట్టం -2025కు వ్యతిరేకంగా గాజువాకలో శుక్రవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. గాజువాకలోని 55 మసీదుల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు నిరసన వ్యక్తం చేస్తూ ర్యాలీ చేశారు. గాజువాక సయ్యద మదీనా షా దర్గా నుంచి జగ్గు జంక్షన్ వరకు సాగి తిరిగి మదీనాషా దర్గాకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ చట్టం మత స్వాతంత్ర్యం, సాంస్కృతిక వారసత్వం, రాజ్యాంగ హక్కులపై దాడిగా భావిస్తున్నామన్నారు. ఈ చట్టం ముస్లింలలో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోందన్నారు. వక్ఫ్ కొత్త చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటాలు చేస్తామన్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో భారతదేశ పాదయాత్ర

» కూర్మన్నపాలెం చేరుకున్న యాత్రికులు


కూర్మన్నపాలెం చేరుకున్న యాత్ర రథం

ఆటోనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సుభిక్షంగా ఉండాలని, లోక కళ్యాణం కోసం అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సంపూర్ణ యావత్ భారతదేశ పాదయాత్ర 7 సార్లు నిర్వహిసున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పాదయాత్ర 1984లో ప్రారంభించామనీ, నేటికి 6 పర్యాయాలు పూర్తి చేసి, మూడు నెలలు క్రితం ద్వారకా నుంచి 7వ పర్యాయం ప్రారంభించామని, శుక్రవారానికి కూర్మన్నపాలేనికి చేరుకుందన్నారు. ఈ పాదయాత్ర శ్రీకృష్ణ భగవానుని భక్తి పాటలు, భజనలతో కేథారినాథ్ , బదరీనాథ్, బృందావనం, అయోధ్య, జనకపూర్, పూరీ, శ్రీకూర్మం, సింహాచలం, మంగళగిరి, తిరుపతి, అహోబిలం, మీదుగా రామేశ్వరం వరకూ కొనసాగుతుందని తెలిపారు.

ఇళ్లు కట్టకుండానే బిల్లులు

» హౌసింగ్‌లో జియో ట్యాగింగ్‌తో మోసాలు
» విజయరాంపురం లేఅవుట్‌లో 182 ఇళ్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తి కాకుండానే బిల్లులు చెల్లించారన్న వాదన ఉంది. జియో ట్యాగింగ్ సాయంతో ఎవరికీ అనుమానం రాకుండా బిల్లులు చేసినట్టుకలెక్టర్‌కు తాజాగా ఫిర్యాదు అందింది. పద్మనాభం మండలం విజయరాంపురం లేఅవుట్‌లో 182 ఇళ్లకు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు భిన్నంగా జియో ట్యాగింగ్ చేసి కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నగర శివారులో 65 లేఅవుట్‌లలో లక్షకు పైగా ఇళ్లు నిర్మిస్తున్నారు. నిర్మాణాలకు ముందు అధికారులు ఆయా ప్రాంతాలకు లబ్ధిదారులను తీసుకెళ్లి వారికి కేటాయించిన ప్లాటు ముందు నిలబెట్టి ఫొటోలు తీసి, జియో ట్యాగింగ్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. దశల వారీగా లబ్ధిదారులకు ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తరువాత బిల్లులు చెల్లిస్తారు. 22వ వార్డుకు చెందిన వారికి పద్మనాభం మండలం విజయరాంపురం, మద్ది, ఆనందపురం మండలం గొట్టిపల్లిలో ప్లాట్లు మంజూరు చేశారు. విజయరాంపురంలో కొన్ని ఇళ్లు పూర్తి చేయకుండానే నిర్మాణాలు జరిగినట్టు ఆన్‌లైన్‌లో చూపించారు. లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్ల వద్ద కాకుండా సమీపంలో దాదాపు నిర్మాణాలు పూర్తయిన ఇళ్ల వద్ద నిల్చోబెట్టి ఫొటోలు తీసి అప్‌లోడ్ చేశారన్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. దీనిపై లబ్ధిదారులకు అనుమానం కలిగి వార్డు కార్యదర్శులు, హౌసింగ్ అధికారులను నిలదీశారు. కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో నిర్మాణాలకు, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన బిల్లులకు మధ్య వ్యత్యాసం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్న 112 ఇళ్ల గోడల వరకు నిర్మాణాలు పూర్తిచేసినట్టు వివరించారు. గొలగాని శైలజ అనే లబ్ధిదారు ఇల్లు రూఫ్ కాస్ట్ (స్లాబ్ వేయడం) వరకు పనులు చేపట్టగా ఆన్‌లైన్‌లో మొత్తం ఇంటి నిర్మాణం పూర్తయిందని చూపించారు. అలాగే పల్లా భాగ్యశ్రీ ఇల్లు పునాది కోసం కాలమ్స్ వేసి గ్రావెల్ కప్పి అక్కడ కొన్ని ఇటుకలు ఉండగా నిర్మాణం పూర్తియినట్టు చూపించారు. మండపాక జ్యోతి పాటులో పునాది వరకు పనులు జరగ్గా ఆన్‌లైన్‌లో శ్లాబ్ వేసినట్టు బిల్లులు చేశారు. వీటిపై విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జీవీఎంసీ సిబ్బందిపై కాంట్రాక్టర్ దౌర్జన్యం?

» స్టాండింగ్ కమిటీ ఆమోదం లేకుండా ఆశీలు వసూలు చేయకూడదన్న రెవెన్యూ ఉద్యోగి
» ఆగ్రహంతో అతనిపై దాడికి యత్నం
» కాంట్రాక్టర్‌కు వత్తాసు పలికిన మరో ఉద్యోగి
» రామకృష్ణా రైతుబజార్‌లో సంఘటన

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్టాండింగ్ కమిటీ ఆమోదం లేకుండా ఆశీలు వసూలు కూడదని వారించిన రెవెన్యూ ఉద్యోగిపై కాంట్రాక్టరు దాడికి యత్నించాడు. ఈ సంఘటన శుక్రవారం ఉదయం జీవీఎంసీ జోన్-4 పరిధిలోని రామకృష్ణారైతుబజార్‌లో జరిగింది. వివరాలిలాఉన్నాయి. వన్‌టౌన్ రామకృష్ణారైతుబజార్‌లో దుకాణాల నుంచి ఆశీలు వసూలుకు నిర్వహించిన వేలంలో ఓ వ్యక్తి కాంట్రాక్టు దక్కించుకున్నాడు. స్టాండింగ్ కమిటీ ఆమోదం లభించకపోవడంతో రెవెన్యూ విభాగం సిబ్బందే ఆశీలు వసూలు చేయాలి. కానీ కాంట్రాక్టర్ రుబాబు చేసి వసూలుచేస్తున్నాడు. దీనిపై కొంతమంది వ్యాపారులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం జోన్-4 రెవెన్యూ అధికారితోపాటు మరో ఉద్యోగి రామకృష్ణారైతుబజార్‌కు వెళ్లారు. ఆశీలు వసూలుచేస్తున్న వారిని వారించారు. కాంట్రాక్టర్, అతని కుమారుడు అక్కడికి చేరుకుని రెవెన్యూ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నేను ఎవరో తెలిసి ఇబ్బందిపెడతారా అంటూ దుర్భాషలాడారు. రెవెన్యూ అధికారి సమాధానం ఇస్తుండగా కాంట్రాక్టర్ నెట్టేందుకు యత్నించడంతో భయభ్రాంతులకు గురయ్యారు. ఉన్నతోద్యోగిపై కాంట్రాక్టర్ తిరగబడితే కిందిస్థాయి ఉద్యోగి కాంట్రాక్టర్‌కు వత్తాసు పలికారని, రాజకీయ అండదండలున్న వారితో పెట్టుకోవద్దని హెచ్చరించారని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా పోలీసులకు ఫిర్యాదుచేయాలని భావించిన రెవెన్యూ అధికారికి సర్ది చెప్పి తీసుకువెళ్లిపోవడం కొసమెరుపు.

భక్తిశ్రద్ధలతో శుభ శుక్రవారం


వేపగుంటలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు


మల్కాపురంలో శిలువతో క్రైస్తవుల ప్రదర్శన

మల్కాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలోని క్రైస్తవులు గుడ్ ఫ్రై డేను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం శిలువ పట్టుకొని వీధుల్లో తిరుగుతూ క్రీస్తు గీతాలు ఆలపించారు 41 రోజులుగా శ్రమ దినాలు పాటిస్తున్నారు. ఆదివారం జరిగే ఈస్టర్‌తో ఈ శ్రమదినాలు ముగుస్తాయి.

పెందుర్తి: గుడ్ ఫ్రై డే సందర్భంగా క్రైస్తవులు పెందుర్తిలో శాంతి ర్యాలీలు నిర్వహించారు. ఏసు క్రీస్తు శిలువ ఘట్టాలను ప్రదర్శిస్తూ. గీతాలు, ఏసు సందేశం వినిపిస్తూ ఈ ర్యాలీ జరిపారు.

వేపగుంట: వేపగుంట ముత్యాలమ్మ కాలనీ బైబిల్ మిషన్ సమృద్ధి గృహంలో గుడ్ ఫ్రై డేను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రీస్తు బోధనలు తెలుపుతూ శిలువ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్ సీహెచ్ సుందరరావు మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రజల కోసం మరణించిన రోజు శుక్రవారం అని, క్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను గుర్తు చేసుకుంటూ ర్యాలీ చేస్తామన్నారు. వేపగుంట కొండపై నుంచి కూడలి వరకూ ర్యాలీ చేశారు. పాస్టర్లు డేనిష్, సంతోష్, పాల్, అబ్రహం సందీప్, సువర్ణరాజు పాల్గొన్నారు.

ఎన్ఏడీ జంక్షన్: జీవీఎంసీ 52, 90 వార్డుల పరిధిలోని చర్చిల్లో గుడ్ ఫ్రై డే నిర్వహించారు. బాజీ జంక్షన్‌లోని సెయింట్ సేవియర్ లూథరన్ చర్చి, బుచ్చిరాజుపాలెం సెయింట్ థామస్ చర్చి, ఎన్ఏడీ యూనైటెడ్ క్రైస్తవ చర్చి, కరాసలోని పెంతకోస్తు చర్చిలో ప్రార్థనలు జరిగాయి.

శివారు గ్రామాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు

» రహదారి విస్తరణలో జాప్యమే కారణం
» ఏళ్లు గడుస్తున్నా స్పందించని పాలకులు, అధికారులు


సత్తివానిపాలెం గ్రామంలో నిలిచిన వాహనాలు

గోపాలపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 88వ వార్డులోని శివారు గ్రామాల ప్రజలు ట్రాఫిక్ సమస్యతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. రహదారి విస్తరణ పనుల్లో జాప్యం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. షీలానగర్ నుంచి గవర జగ్గయ్యపాలెం, సత్తివానిపాలెం, కోటనరవ, నరవ గ్రామాల మీదుగా సబ్బవరం, గోపాలపట్నం వెళ్లడానికి బైపాస్ రహదారి ఉంది. ఈ రోడ్డు నాలుగు గ్రామాల మీదుగా ఉండడం, ఇరుగ్గా ఉండడంతో పదేళ్ల క్రితం విస్తరణ పనులు చేపట్టారు. రహదారి మొత్తం విస్తరణ చేపట్టినా కోటనరవ, సత్తివానిపాలెం గ్రామాల్లో మాత్రం పనులు జరగలేదు. ఈ రెండు గ్రామాల్లో విస్తరణ పనులు చేపట్టడానికి, బాధితులకు టీడీఆర్‌లు, నష్టపరిహారం ఇవ్వడానికి ప్రతిపాదనలు కూడా చేశారు. దీనిపై అధికారులు, గ్రామస్తుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం తో పనులు నిలిచిపోయాయి. దీంతో ఈ రహదారిలో ప్రయాణించే వారు కోటనరవ, సత్తివానిపాలెం గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ రహదారి సబ్బవరం-షీలానగర్, గోపా లపట్నం- షీలానగర్, దువ్వాడ ప్రాంతాలకు బైపాస్‌గా ఉండడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎదురెదురుగా భారీ వాహనాలు వస్తే సత్తివానిపాలెం, కోటనరవ గ్రామాల్లో ట్రాఫిక్ స్తంభిస్తోంది. పాలకులు, అధికారులు స్పందించి కోటనరవ, సత్తివానిపాలెం గ్రామాల్లో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

టిడ్కో ఇళ్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకు వినతి


వినతిపత్రం అందిస్తున్న సత్యనారాయణ

పెదగంట్యాడ, ఏప్రిల్ 18 (ఆంధ్ర జ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలోని టిడ్కో గృహసముదాయాలకు ప్రాథమిక వసతులు కల్పించాలని, ఇక్కడి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను గాజువాక నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి కె.సత్యనారాయణ కోరారు. శుక్రవారం అమరావతిలోని పార్టీ కార్యాలయంలో రామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. పెదగంట్యాడలోని భానోజీతోట, బీసీ రోడ్డు, దువ్వాడ, ట్రై జంక్షన్, అగనంపూడి ప్రాంతాల్లో ఉన్న టిడ్కో గృహసముదాయాలకు తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించలేదని పేర్కొన్నారు. వీటికోసం ఎన్నిమార్లు జీవీఎంసీ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేక పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గాజువాక నియోజకవర్గం పరిధిలో 6890 టిడ్కో గృహాలు నిర్మించి 2018లో లాటరీ ద్వారా లబ్ధిదారులకు ఎంపిక చేశారని, వారందరికీ విక్రయ ఒప్పంద పత్రాలు అందజేశారని పేర్కొన్నారు. లబ్ధిదారులకు ఇప్పటి వరకు గృహాలు ఇవ్వలేదని, ఆ గృహాలకు అవసరమైన వసతులు కల్పించలేదని పేర్కొన్నారు. కొంతమంది లబ్ధిదారులు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని గృహాలకు సంబంధించిన రుణాలు చెల్లించారని, కొంతమంది నెల వాయిదా పద్ధతిలో రుణాలు బ్యాంకులకు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. తమ ఇళ్ల కోసం, సదుపాయాల కోసం గాజువాక యూసీడీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.